www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం
25 జూన్ 2023, హైదరాబాద్
సంపుటి: 1, సంచిక: 245

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




# బుజ్జగింపులు ఫలిస్తాయా?

## నడ్డాతో ఈటల, రాజగోపాల్‌రెడ్డి భేటీ

### తెలంగాణ రాజకీయాలపై చర్చ ○ తీవ్ర అసంతృప్తితో నేతలు

**విశాలభారతి - హైదరాబాద్ :** బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొన్నిరోజులుగా తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. పార్టీ కార్యక్రమాల్లోనూ పెద్దగా పాల్గొనడం లేదు. దీంతో అధిష్టానం వారిని ఢిల్లీకి పిలిపించింది. రాష్ట్ర పరిస్థితిపై ఆరా తీసినట్టు సమాచారం. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ రాజీ పడ్డాయని ప్రజలు భావిస్తున్నారని.. పరిస్థితి ఇలాగే కొనసాగితే పార్టీ గెలుపు కష్టమని ఈ ఇద్దరు నేతలు హై కమాండ్ కు స్పష్టం చేసినట్టు తెలిసిందే. తెలంగాణ బీజేపీలో ఏర్పడిన అసంతృప్త పరిస్థితుల్ని చక్కదిద్దేందుకు బీజేపీ హైకమాండ్ రంగంలోకి దిగింది. ఈటల రాజేందర్, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డిలను ఢిల్లీకి పిలిపించింది. పార్టీ కేంద్ర కార్యాలయంలో వారిద్దరితో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశం అయ్యారు. వారి అసంతృప్తికి కారణాలను అడిగి తెలుసుకున్నట్లుగా భావిస్తున్నారు. భారత రాష్ట్ర సమితిని ఓడించడమే ఏకైక టార్గెట్ గా తాము బీజేపీలో



చేరామని కానీ ఇప్పుడు పరిస్థితులు బీఆర్ఎస్‌తో రాజీ పడినట్లుగా ఉన్నాయన్న అభిప్రాయాన్ని వారు హైకమాండ్ ముందు వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది.

**బీజేపీ మెతకగా వ్యవహరిస్తోందన్న అనుమానాలు**

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అందర్నీ అరెస్ట్ చేసి కవితను అరెస్ట్ చేయకపోవడంతో రెండు

మిగతా 2లో



# బీఆర్ఎస్‌లో వీళ్లుంటారా.. పోతారా?

### వీళ్లకు పక్కా

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి, అసిఫాబాద్ నుంచి ఆత్రం సక్కు, పినపాక నుంచి రేగా కాంతారావు, కొత్తగూడెం నుంచి వనమా వెంకటేశ్వరరావు, నకిరేకల్ నుంచి చిరుమర్తి లింగయ్య, ఇల్లెందు నుంచి హరిప్రియా నాయక్, తాండూరు నుంచి పైలట్ రోహిత్ రెడ్డి, ఎల్బీ నగర్ నుంచి సుధీర్ రెడ్డి, కొల్లాపూర్ నుంచి బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎల్లారెడ్డి నుంచి జాజుల సురేందర్ రెడ్డి, భూపాలపల్లి నుంచి గండ్ర వెంకటరమణా రెడ్డి, పాలేరు నుంచి కందాల ఉపేందర్ రెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ సమయంలోనే మళ్లీ వీరికే టికెట్టు ఇస్తామని పార్టీ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చినట్టు వార్తలు గుప్పుమన్నాయి.

**హైదరాబాద్ స్టేట్ బ్యూరో :** మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈసారి మూడు పార్టీ నడుమ పోటీ తీవ్రంగా ఉండనుంది. విజయం పక్కా అని ప్రచారం చేసుకుంటున్న బీఆర్ఎస్ కు కాంగ్రెస్, బీజేపీలు సవాల్ విసురుతున్నాయి. ఓ పక్క కాంగ్రెస్ పార్టీలో కొత్త నేతల చేరికలతో బలంగా తయారవుతుంది. మరోపక్క బీజేపీ తన పదునైన వ్యూహాలతో జనాల్లోకి వెళుతుంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్ని ఓ అంశం ప్రతిపక్షాలకు కలిసివచ్చే అంశంగా మారింది. వచ్చే నెలలో మొదటి జాబితా అభ్యర్థులను ఖరారు చేసుకునే పనిలో అన్ని పార్టీలు నిమగ్నమయ్యాయి. అంతర్గతంగా ఇందుకు సంబంధించిన కసరత్తును ఆయా పార్టీ ముమ్మరం చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్ రావు ఈ విషయంలో ముందున్నట్టు తెలుస్తుంది. వచ్చే నెలలో పార్టీ అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేస్తారని ప్రచారం జోరుగా సాగుతోంది. సిట్టింగుల్లో టెన్షన్బీ ఆర్ఎస్ తొలి జాబితాలో దాదాపు 60 మంది అభ్యర్థులను ప్రకటించేందుకు కేసీఆర్ కసరత్తు చేస్తున్నారని సోషల్ మీడియాలో ప్రచారం ఊపకందుకుంది. దీంతో అప్పుడే బీఆర్ఎస్ నేతల్లో టెన్షన్ పట్టుకుంది. ఇటీవల కేసీఆర్ బహిరంగంగానే ఎమ్మెల్యేకు వార్నింగ్ ఇవ్వడంతో సిట్టింగుల్లో భయం చుట్టుకుంది. ఎక్కడ తమకు సీట్లను కాదనంటారోనని లోలోన ఆందోళన పడుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో నెలకొన్న టెన్షన్ ను సీఎం దూరం చేసినట్టు సమాచారం.

### ఆ 12 స్థానాల్లో సిట్టింగ్ లకే సీట్లు ఖరారు
### కేసీఆర్ తీరుతో తీవ్ర నిరాశలో ఆశావహులు
### తీవ్ర ఆరోపణలు ఉన్నా సీట్లు ఇవ్వడంపై ఆగ్రహం
### వచ్చే నెలలో 60 మంది తొలి జాబితా
### పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో నెలకొన్న టెన్షన్

**12 ఎమ్మెల్యేలు ఖుషీ**

ముందునుండి బీఆర్ఎస్ తరపున ఉండి ఎమ్మెల్యేలుగా అయిన వారి సంగతి ఎలా ఉన్నా.. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన 12 మంది ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ తరపున టికెట్లు దాదాపుగా ఖరారు అయినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో బీఆర్ఎస్ ప్రకటించే ఫస్ట్ లిస్ట్ లోనే వీరు పేర్లు పెట్టనున్నట్లు తెలిసింది. దీంతో ఆయా నియోజక వర్గాల్లో టికెట్ ఆశిస్తున్న నేతలకు ముందస్తుగానే గులాబీ బాస్ చెక్ పెట్టాడని ప్రాచారం నడుస్తోంది. మరోవైపు అసెంబ్లీ టిక్కెట్ ఖరారు అయినట్లు సమాచారం అందండడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేల క్యాంపుల్లో సంబురాలు జరుగుతున్నాయి. వారు ఇప్పటికే తమ నియోజవర్గాల్లో ప్రచారం ప్రారంభించేసినట్లు తెలుస్తోంది.

**నియోజకవర్గాల్లో విస్తృతంగా**

దీంతో రాబోయే ఎన్నికల్లో తమకు సీట్లు దాదాపుకు ఖరారు అయ్యాయని, బీఆర్ఎస్ త్వరలో ప్రకటించే లిస్టులో వీరి పేర్లను ఉంచనున్నట్లు తెలిసింది. పార్టీ టికెట్ పై సీఎం కేసీఆర్ నుంచి స్పష్టమైన హామీ లభించడంతో ఆ ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారని, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.


**భవిష్యత్ అవసరాల కోసం**

అయితే ఇతర పార్టీల నుంచి వచ్చిన టికెట్ ఖరారు చేయడం వెనుక కేసీఆర్ ప్రత్యేకమైన వ్యూహంతో వ్యవహరిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. పార్టీ మారిన వారికి టికెట్ కచ్చితంగా ఇస్తామనే సంకేతాలను ఇవ్వడం ద్వారా భవిష్యత్తులోనూ బీఆర్ఎస్‌లోకి ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు వచ్చే అవకాశం ఉంటుందని పలువురు రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. త్వరంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కన్నులొట్టబోయి బీఆర్ఎస్ కు అధికారం దక్కితే.. కాంగ్రెస్, బీజేపీ తరపున గెలిచినా ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో వారికి ప్రాధాన్యత ఉంటుందని కేసీఆర్ ఇప్పుడే సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. చూడాలి రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ రాజకీయం ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి

### నిరాశలో ఆ నేతలు

కాంగ్రెస్ నుంచి వచ్చిన వారికి సీట్లు పక్కా కావడంతో బీఆర్ఎస్ పార్టీలో మొదటినుంచి ఉంటూ వచ్చిన ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతలు దీంతో నిరాశలో మునిగిపోయారు. ఎల్బీనగర్ నుంచి సీటు ఆశిస్తున్న రాంమోహన్ గౌడ్, మహేశ్వరం నుంచి తీగల కృష్ణారెడ్డి, తాండూరులో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, నకిరేకల్ లో వేముల వీరేశం, ఆసిఫాబాద్ లో జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, కొత్త గూడెంలో జలగం వెంకట్రావు, వనమా వెంకటేశ్వరరావు, గడల శ్రీనివాసరావు, ఇల్లందులో కోరం కనకయ్య, పాలేరులో తుమ్మల నాగేశ్వరరావు, భూపాలపల్లిలో ఎమ్మెల్సీ మధుసూదనాచారికి కేసీఆర్ షాక్ ఇచ్చినట్టేనని స్పష్టం అవుతంది. ఇక వారు సీటు మరో 5 ఏండ్లు ఆగాల్సిందేనని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే, వారికి ప్రత్యామ్నాయంగా చైర్మన్ గిరిలు, ఇతర పదువులు కట్టబెట్టే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

# జీవో నెం.111 భూముల్లో కొంగొత్త నగరం సాధ్యమే



జీవో నెం. 111ను రద్దు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దీంతో లక్షన్నర ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు బహిరంగ మార్కెట్‌లో కి రానున్నాయి. ప్రస్తుతం నగర జనాభా కోటిన్నరకు చేరింది. శివారు ప్రాంతాలను దాటి నగరం శరవేగంతో విస్తరిస్తున్నది. ఈ క్రమంలో ఏటా మూడు లక్షల మంది జీవనోపాధి కోసం మహానగరానికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. ల్యాండ్ బ్యాంక్ పుష్కళంగా ఉండే అన్నిరంగాలను ప్రభావితం చేసే రియల్ ఎస్టేట్ కూడా బాగుంటుంది. అదే ల్యాండ్ బ్యాంక్ లేకపోతే పరిశ్రమలకు కొరత ఏర్పడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సన్నగిల్లిపోయే ప్రమాదం ఉంటుంది. వెస్ట్ సిటీని ఆనుకుని లక్షన్నర ఎకరాల భూములు బహిరంగ మార్కెట్లోకి వచ్చిన...ఇప్పటికిప్పుడూ అమ్ముకుని సొమ్ము కోవాలని అనుకున్నా...కనీసం పదేళ్ల వరకు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో అమ్మకాలు, కొనుగోళ్లను ఆ భూములు ప్రభావితం చేస్తాయని అంటున్న నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) తెలంగాణ చాప్టర్ సలహాదారులు, లహరి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ హరిబాబు గడిపాటితో ఈ వారం విశాలభారతి రియల్ టాక్.

రియల్ టాక్‌లో...

# రేపు బ్లాక్ డే

### రాష్ట్రం మొత్తం కార్యక్రమాల నిర్వహించండి
### కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన రోజు
### బీజేపీ స్టేట్ చీఫ్ బండి సంజయ్ పిలుపు

**విశాలభారతి -హైదరాబాద్:** ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ 1975 జూన్ 25వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ విధించడాన్ని చీకటి రోజుగా భావిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీ రోజుల్లో దేశంలో ప్రజాస్వామిక వాదులను, జాతీయ వాదులను, వాజ్‌పేయితో సహా ఇతర ప్రతిపక్ష నేతలను, లక్షలాది మందిని అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధాలకు గురిచేశారని తెలిపారు. జూన్ 25వ తేదీని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఎమర్జెన్సీ డే ని చీకటి దినంగా భావిస్తూ నేటి తరానికి నాటి ఎమర్జెన్సీ డే ఆకృత్యాలను తెలియజేస్తూ కార్యక్రమాలను చేపట్టాల్సిందిగా బండి



సంజయ్ కోరారు.

భారతీయ జనతా పార్టీ ఈనెల 28 నుంచి జూలై 3వ తేదీ వరకు నిర్వహించనున్న

మిగతా 2లో



# 30న పోడు పట్టాల పంపిణీ

- ఆసిఫాబాద్‌లో ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు

**విశాలభారతి - హైదరాబాద్ :** పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో జూన్ 30వ తేదీ నుంచి ఆదివాసీ గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుండి అదే రోజు (జూన్ 30)న సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వారి వారి జిల్లాలు, నియోజకవర్గాల్లో అదే రోజు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్నారు. పోడు పట్టాల పంపిణీ చేశాక.. వీరికి కూడా రైతుబంధు అందించనున్నారు. ఈ నెల 24 నుంచే పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రకటించినప్పటికీ.. కొన్ని అనివార్య కారణాలతో ఈ నెల 30 తేదీన పట్టాలు ఇవ్వాలని రీ షెడ్యూల్ చేశారు. జాతీయ ఎన్నికల కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తుండడం, అందుకు సంబంధించి నిన్న ఇవ్వాల జిల్లా కలెక్టర్లకు శిక్షణాతరగుతులు నిర్వహిస్తుండడం.. అదే సందర్భంలో ఈ నెల 29న బక్రీద్ పండుగ కూడా ఉన్నాయి. ఈ కారణాలతో తొలుత ప్రకటించిన కార్యక్రమాన్నిజూన్ 30కి మార్పు చేసినట్లు అధికారులు తెలిపారు. జూన్ 30న నూతనంగా నిర్మితమైన ఆసిఫాబాద్

మిగతా 2లో

### మెట్రో రెండో దశ విస్తరణకు అనుమతివ్వండి

- మరో ఇద్దరు కేంద్రమంత్రులను కలిసిన మంత్రి కేటీఆర్
- మెట్రో రెండో దశ గురించి మంత్రి హరిదీప్‌సింగ్ పూరితో భేటీ
- ధాన్యం సేకరణపై కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో సమావేశం
- కొనసాగుతున్న కేటీఆర్ ఢిల్లీ పర్యటన

02

# బుజ్జగింపులు ఫలిస్తాయా?

మొదటి పేజీ తరువాయి

పార్టీల మధ్య ఢిల్లీలో దోస్తీ..గల్లీలో కుస్తీ అని ప్రజలు నమ్ముతున్నారని గతంలోనే కొంత మంది నేతలు వ్యాఖ్యానించారు. ఆ తర్వాత కర్ణాటకలో పలితాలు బీజేపీకి తేడాగా రావడంతో పాటు కాంగ్రెస్ పార్టీ పుంజుకోవడంతో పరిస్థితి మారిపోయిందని చెబుతున్నారు. బీజేపీకి వచ్చిన హైప్‌ను.. బెంగాల్ తరహా రాజకీయంతో మరింత పెంచుకోవాల్సింది పోయి.. బీఆర్ఎస్ విషయంలో మెతకగా వ్యవహరించి మొత్తం పార్టీ ఎదగకుండా చిక్కుల్లో పడేసుకున్నామని నేతలు అధ్యక్షుడు నడ్డాకు వివరించినట్లుగా తెలుస్తోంది.

**తెలంగాణలో అధికారమే లక్ష్యమంటున్న బీజేపీ హైకమాండ్**

బీఆర్ఎస్‌తో రాజీ పడే ప్రసక్తే లేదని.. వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టాలనే బీజేపీ టార్గెట్ అని నడ్డా ఈటల రాజేందర్ , కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు స్పష్టం చేసినట్లుగా చెబుతున్నారు. తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని.. ముందు ముందు బీఆర్ఎస్ పై పోరాటం తీవ్ర స్థాయిలో ఉంటుందని హామీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు. మరో వైపు వీరితో సమావేశంలో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా హుటాహుటిన ఢిల్లీ చేరుకున్నారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్నప్పటికీ వాటిని రద్దు చేసుకుని కిషన్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఆయన సమక్షంలోనే వచ్చే ఎన్నికల్లో తెలంగాణ విజయానికి బీజేపీ రెడీ చేసిన ప్రణాళికల గురించి ఈటల , రాజగోపాల్ రెడ్డిలకు వివరించినట్లుగా చెబుతున్నారు.

**ఈటల , కోమటిరెడ్డి ఏ నిర్ణయం తీసుకుంటారు ?**

కొద్ది రోజులుగా బీజేపీలో యాక్టివ్ గా లేరు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. పార్టీలో ఉన్న అంతర్గత విబేధాలకు తోడు.. బీఆర్ఎస్ పై పోరాటంలో వెనుకడుగు పడటం కూడా దీనికి కారణం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. తన సోదరుడు రాజగోపాల్ రెడ్డి కూడా కాంగ్రెస్ లోకి వస్తారని.. హైకమాండ్ కు భరోసా ఇస్తున్నారు. ఈటల రాజేందర్ కూడా కాంగ్రెస్ లోకి వెళ్తారన్న ప్రచారం ఊపందుకుంది. హైకమాండ్ చెప్పిన మాటలపై విశ్వాసం ఉంటే.. వీరిద్దరూ బీజేపీలోనే ఉండే అవకాశం ఉంది.. లేకపోతే.. తమ దారి తాము చూసుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

## ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి తప్పిన పెను ప్రమాదం

**స్టేట్ బ్యూరో హైదరాబాద్:** తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. పైలెట్ రోహిత్ రెడ్డి కారు ప్రమాదానికి గురైంది. కర్ణాటకలోని శృంగేరి పీఠ సందర్శనకు వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రంలోనిమంగళూరు సమీపంలోని ముదూరునల్లూరు క్రాస్ వద్ద శనివారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి రోహిత్ రెడ్డి కారు చెట్టును ఢీ కొట్టినట్లు తెలుస్తోంది. వాహన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి సురక్షితంగా ఉన్నారు.

**క్షేమంగా ఉన్నా..**

తాండూరు నియోజకవర్గ ప్రజలందరి ఆశీర్వాదాల వల్ల తాను క్షేమంగానే ఉన్నానని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తెలిపారు. తనకు శనివారం ఉదయం యాక్సిడెంట్ అయినట్టు వస్తున్న వార్తలు వాస్తవమే అని చెప్పారు. కానీ ఈ ప్రమాదంలో తనకు ఎటువంటి గాయాలు కాలేదని స్పష్టం చేశారు. తాండూరు ప్రజలందరి ప్రేమానురాగాల వలన క్షేమంగానే ఉన్నట్లు చెప్పారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులు ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని కోరారు.

## 30న పోడు పట్టాల పంపిణీ

మొదటి పేజీ తరువాయి

జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నిర్మల్ మంచిర్యాల జిల్లాల కొత్త కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభించారు. తాజాగా మిగిలిన ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎస్పీ కార్యాలయాన్ని ఈనెల 30న ప్రారంభించి బహిరంగ సభలో పాల్గొననున్నారు. పోడు పట్టాలు పొందిన వారికి సాధారణ రైతుల మాదిరిగానే రైతు బంధు పథకం కింద ఆర్థిక సాయం అందించాలని సీఎం కేసీఆర్ ఇదివరకే స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వమే బ్యాంకు అకౌంట్‌ను తెరిచి పోడు భూముల పట్టాల యాజమానులకు నేరుగా వారి ఖాతాల్లో రైతు బంధును జమ చేస్తుందని తెలిపారు.

పోడు పట్టాలు అందుకున్న గిరిజన రైతుల బ్యాంకు అకౌంట్ల వివరాలను ఆర్థిక శాఖకు అందజేయాలని, దానిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను, ఆ శాఖ అధికారులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4లక్షల ఎకరాలకు పైగా 1.55 లక్షల మంది గిరిజనులకు పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో పరిశీలన జరిగింది. ఇందుకు సంబంధించి పట్టాలను కూడా అధికారులు సిద్ధం చేశారు.

# రేపు బ్లాక్ డే

మొదటి పేజీ తరువాయి

'మేరా పోలింగ్ బూత్ సబ్సే మజ్బూత్' కార్యక్రమంలో భాగంగా శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా ఇన్‌చార్జ్‌లతో బండి సంజయ్ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. పార్టీలో బాధ్యతలు నిర్వహిస్తున్న వారితో సహా అందరూ మేరా పోలింగ్ బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈనెల 27న ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రజలు వీక్షించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మేరా పోలింగ్ బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమానికి ప్రముఖ్‌గా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, సభ్యులుగా బద్దం మహిపాల్ రెడ్డి, నరేందర్, డా.మాలతి, యశ్పాల్ గౌడ్, క్రాంతి కుమార్ వ్యవహరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండల లక్ష్మీనారాయణ, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఇతర ముఖ్య నాయకులు, జిల్లా ఇంచార్జ్‌లు హాజరయ్యారు.





# మెట్రో రెండో దశ విస్తరణకు అనుమతివ్వండి

**స్టేట్ బ్యూరో హైదరాబాద్:** తెలంగాణలో అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టు అంశాలు గురించి కేంద్ర మంత్రులకు వివరించడానికి మంత్రి కేటీఆర్ చేస్తున్న ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. నిన్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన కేటీఆర్.. శనివారం మరో ఇద్దరు కేంద్రమంత్రులను కలిశారు. ముందుగా పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరిదీప్‌సింగ్ పూరిని కలిశారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కోరినట్లు సమాచారం. లక్డీకాపూల్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు 26 కిలోమీటర్లు, నాగోల్ నుంచి ఎల్బీ నగర్ వరకు 5 కిలోమీటర్ల మెట్రో లైన్‌కు ఆమోదం తెలిపి, నిధులు అందించాలని కోరినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో లింక్ రోడ్ల పనులకు సంబంధించి వివరాలు అందించి సాయం కోసం విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను కలిసిన కేటీఆర్, ఎంపీలు రంజిత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి.. ధాన్యం సేకరణపై పలు అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఇచ్చిన ధాన్యం సేకరణ పరిమితిని రెట్టింపు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. ఉప్పుడు బియ్యం సేకరణ పరిమితిని కూడా పెంచాలని కోరారు. రాత్రి 10 గంటల 15 నిమిషాలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతోనూ కేటీఆర్ బృందం భేటీ కానుంది. హైదరాబాద్‌లో రోడ్ల అభివృద్ధి హోంశాఖ పరిధిలోని భూముల కేటాయింపుపై విజ్ఞప్తి చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా, శుక్రవారం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అనంతరం విలేకరులతో కేటీఆర్ ముచ్చటించారు. ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయాలు ఏర్పాటు చేసినా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదన్న ప్రశ్నపై ఆయన జవాబు ఇచ్చారు. దేశ రాజకీయాలు ఢిల్లీ కేంద్రంగానే సాగాలని అనుకోవద్దని.. హైదరాబాద్ నుంచే చక్రం తిప్పుతామని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పని చేసిన ప్రధాన మంత్రులందరిలో అత్యంత బలహీన ప్రధాని నరేంద్ర మోడీనేనని.. ఆయనకు అవకాశం ఇస్తే ఢిల్లీని కూడా గుజరాత్‌కు తరలిస్తారని ఎద్దేవా చేశారు.



## బీహార్‌లో నిర్మాణంలో ఉన్న మరో వంతెన కూలింది..

### రెండు వారాల్లో కూలిన రెండో వంతెన

బీహార్‌లో నిర్మాణంలో ఉన్న మరో వంతెన కూలిపోయింది. రెండు వారాల్లో కూలిన రెండో వంతెన ఇది. బీహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాలో శనివారం ఈ సంఘటన జరిగింది. మెచ్చి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జీ పిల్లర్ కూలినట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్ట్ డైరెక్టర్ అరవింద్ కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మానవ తప్పిదం వల్లనే నిర్మాణంలో ఉన్న వంతెన పిల్లర్ ఒరిగిపోయినట్లు తెలుస్తున్నదని అన్నారు. కిషన్‌గంజ్, కలిహార్‌ను అనుసంధానం చేసే ఈ వంతెనను మెచ్చి నదిపై నిర్మిస్తున్నట్లు చెప్పారు. జూన్ 4న బీహార్‌లోని ఖగారియా జిల్లాలో గంగా నదిపై నిర్మిస్తున్న వంతెన కుప్పకూలింది. ఖగారియా జిల్లాను భాగల్పూర్‌తో అనుసంధానించే ఆ వంతెన పేకముక్కలా పడిపోయింది. ఈ సంఘటనలో ఒక సెక్యూరిటీ గార్డు మరణించాడు. 2019 నవంబర్‌లో పూర్తి కావాల్సిన ఆ వంతెన నిర్మాణ పనులు మూడేళ్లకు పైగా కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సంఘటనపై బీహార్ ఇంజనీరింగ్ సర్వీసెస్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పూర్తైన, నిర్మాణంలో ఉన్న అన్ని వంతెనలకు 'స్ట్రక్చరల్ ఆడిట్' నిర్వహించాలని డిమాండ్ చేసింది.



## భారత్‌కు గుడ్ న్యూస్ చెప్పిన సుందర్ పిచాయ్..

### 10 బిలియన్ డాలర్లు పెట్టుపడి పెడుతున్నట్లు ప్రకటన

**హైదరాబాద్:** అమెరికా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోడీ పలువురు పారిశ్రామిక వేత్తలను కలిశారు. అందులో భాగంగా సుందర్ పిచాయ్ తో పాటు మైక్రోసాఫ్ట్ సీ ఈవో సత్య నాదెళ్ల యాపిల్ సీఈవో టిమ్ కుక్ ఓపెన్‌ఏఐ సీఈవో సామ్ ఆల్ట్ మాన్ ఏఎమ్డీ సీఈవో లిసా సు తదితర అగ్రశ్రేణి సీఈఓలతో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్ భారత్‌కు గుడ్ న్యూస్ చెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ తో సమావేశం అనంతరం స్పందించిన గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్... భారత్‌లోని గుజరాత్‌లో గ్లోబల్ ఫిన్ టెక్ ఆపరేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అందుకు భారత దేశంలో డిజిటలైజేషన్ ఫండ్‌లో భాగంగా గూగుల్ 10 బిలియన్ డాలర్లు (రూ. 8.19 లక్షల కోట్లు) పెట్టుబడి పెడుతుందని తెలిపారు.

ప్రధాని మోడీని కలిసిన అనంతరం పిచాయ్ మాట్లాడుతూ "చరిత్రాత్మక యూఎస్ పర్యటన లో ప్రధాని మోడీని కలవడం గౌరవంగా భావిస్తున్నాము. భారతదేశ డిజిటలైజేషన్ ఫండ్ లో గూగుల్ 10 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతుందని మేము ప్రధానితో పంచుకున్నాము. జి.ఐ.ఎఫ్.టి. సిటీ గుజరాత్‌లో మా గ్లోబల్ ఫిన్ టెక్ ఆపరేషన్ సెంటర్ ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటిస్తున్నందుకు సంతోషిస్తున్నాను అని పిచాయ్ పేర్కొన్నారు.

జి.ఐ.ఎఫ్.టి. (గిఫ్ట్) సిటీ అంటే... గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ. ఇది గుజరాత్ రాష్ట్ర రాజధాని గాంధీ నగర్ లో ఉంది. ఈ సందర్భంగా... ప్రధాని మోడీ డిజిటల్ ఇండియా విజన్ రానున్న భవిష్యత్‌కు బ్లూప్రింట్ గా తాను భావిస్తున్నట్లు సుందర్ పిచాయ్ తెలిపారు. అమెజాన్ సీఈఓ ఆండ్రూ జాస్సీ సైతం భారత్‌కు గుడ్ న్యూస్ చెప్పారు. తాము ఇప్పటికే 11 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టామని చెప్పిన ఆండ్రూ జాస్సీ... మరో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు తెలిపారు.



## కోవిడ్19 ఆనవాళ్లు వుహాన్ ల్యాబ్‌లో లేవు

### అమెరికా ఇంటెలిజెన్స్ కొత్త రిపోర్టును రిలీజ్

చైనాలోని వుహాన్ ల్యాబ్‌లో కోవిడ్19 ఆనవాళ్లు లేవని కొత్త రిపోర్టును అమెరికా ఇంటెలిజెన్స్ రిలీజ్ చేసింది. చైనాలోని వుహాన్ వైరాలజీ ల్యాబ్ నుంచి ఆ వైరస్ పాకినట్లు ఆధారాలు దొరకలేదని ఆ నివేదికలో తెలిపారు. మొత్తం నాలుగు పేజీల రిపోర్టును నేషనల్ ఇంటెలిజెన్స్ ఆఫీసు డైరెక్టర్ శుక్రవారం రిలీజ్ చేశారు. ల్యాబ్ నుంచి కోవిడ్ వైరస్ వ్యాప్తి అయిందన్న వాస్తవాలను కొట్టిపారేయలేమని, కానీ ఆ వైరస్ ఆనవాళ్లను మాత్రం గుర్తించలేకపోయినట్లు రిపోర్టులో తెలిపారు. ఇతర ఏజెన్సీలు కానీ.. కోవిడ్ పుట్టుక గురించి పూర్తి వివరాలను సేకరించలేకపోయినట్లు ఓడీఎన్ఐ తెలిపింది. వుహాన్ వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో సమగ్ర స్థాయిలో దర్యాప్తు చేపట్టినట్లు రిపోర్టులో వెల్లడించారు. కానీ మహమ్మారికి చెందిన ఆధారాలు ఏవీ చిక్కలేదన్నారు. సార్స్ సీవోవీ-2 వైరస్‌కు చెందిన ఆనవాళ్లు ఏమీ లేనట్లు తెలిపారు. కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా ప్రబలిన తర్వాత ఆ వైరస్ పుట్టుక చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. అమెరికాతో పాటు ఎన్నో దేశాలు ఆ వైరస్ జాడ గురించి ఆరా తీస్తూనే ఉన్నాయి.

# హైదరాబాద్ వేదికగా తొలి గ్రీన్ ప్రాపర్టీ షో..

**సుస్థిర, పర్యావరణ భవనాల ప్రాధాన్యతను తెలిపేలా ఏర్పాటు ○ సిఐఐఐజిబిసి ఆధ్వర్యంలో హైటెక్స్ వేదికగా ఈనెల 28 నుండి 30 వరకు నిర్వాహణ**

IGBC GREEN PROPERTY SHOW

**హైదరాబాద్, విశాల భారతి :** హైదరాబాద్ వేదికగా ఐజీబిసి గ్రీన్ ప్రాపర్టీ షో జరగనుంది. ఈనెల 28 నుండి 30 వరకు హైటెక్స్ లో సీఐఐ ఐజీబిసి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా గ్రీన్ అండ్ హెల్తీ లివింగ్ విధానాలను ప్రోత్సహించేలా ప్రాపర్టీ షో జరుగుతుందని ఐజీబిసి హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మూడు రోజుల ఈవెంట్ లో గ్రీన్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాపర్టీలను ప్రదరర్శించనున్నారు, డెవలపర్లు, బిల్డర్లు, బిల్డింగ్ ప్రొడక్ట్ లు, సుస్థిరమైన ప్రాపర్టీలు, ఐజీబిసి గ్రీన్ సర్టిఫైడ్ ప్రీసర్టిఫైడ్ ప్రాజెక్ట్ లు, గ్రీన్ ప్రొడక్ట్స్ టెక్నాలజీలు అందుబాటులోకి రానున్నాయి.

హరిత భవనాలు, సహజ వనరులను సంరక్షించడం తోపాటు నివాసితుల జీవన ప్రమాణాలపై అవగాహన పెరుగుతుంది. గ్రీన్ ప్రాపర్టీ షో తొలి ఎడిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం భాగస్వామిగా వ్యహరిస్తోంది. 75కు పైగా ఐజీబిసి ప్రీసర్టిఫైడ్ మరియు సర్టిఫైడ్ రెసిడెన్షియల్ మరియు కమర్షియల్ ప్రాజెక్ట్ లు, గ్రీన్ ప్రొడక్ట్స్ మరియు టెక్నాలజీస్‌పై డే ఎక్స్‌పోలో ప్రదర్శించనున్నారు.

**గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ కు అనూహ్య స్పందన**

తెలంగాణలో పర్యావరణహితమైన బిల్డింగులకు అనూహ్య స్పందన వస్తోంది. ప్రభుత్వమే ఐజీబిసి రేటింగ్ పొందిన భవనాలను నిర్మిస్తుంది. దీంతో గృహ సముదాయాల్లోనూ ఆదరణ వస్తుంది. తెలంగాణ వ్యాప్తంగా 10 శాతానికి పైగా గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. దేశంలోనే సుస్థిరమైన రియల్ ఎస్టేట్ వ్యాపార వేదికగా హైదరాబాద్ నిలిచింది. ఈ క్రమంలో సుస్థిర, పర్యావరణహితమైన విధానాలు ప్రోత్సహించేలా తొలి ఎడిషన్ గ్రీన్ ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నాం. శేఖర్ రెడ్డి, ఐజీబిసి హైదరాబాద్ చాప్టర్ చైర్మన్.



# జిల్లాలో ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం..


- ఖరీఫ్ పంట సాగుపై రైతులు లో ధీమా.
- చల్లని వాతావరణం తో అల్లాదకరంగా మారిన పల్లెలు పట్టణాలు.



**నిజామాబాద్ బ్యూరో- విశాలభారతి :** జిల్లాలో నిన్న రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో రైతన్నలు ఖరీఫ్ పంట సాగుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. సామాన్య ప్రజలు, పిల్లలు, వృద్ధులు,మహిళలు ఇన్ని రోజులు ఉక్కపోతతో అనేక ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి కూసిన భారీ వర్షానికి వాతావ రణం ఒక్కసారిగా చల్లబడడంతో జిల్లా ప్రజల్లో ఆనందం నెలకొంది. వారం రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇదివరకే తెలిపిన నేపథ్యంలో రైతన్నలలో ఎనలేని సంతోషం నెలకోంది. కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు పెరిగి బోరు బావులు కలిగి ఉన్న రైతులు ముందస్తుగా వరి నాట్లు వేయడానికి సన్నద్ధం అవుతు న్నారు. మృగశిర కార్తె ముగిసి ఆరుద్ర కార్తె లో నిన్న రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ఎండిన చెట్లకు, పక్షులకు, జంతువులకు, అడవి ప్రాంతంలో ఉన్న వృక్షాలకు ఎంతో మేలు కలిగింది. వర్షాలు ఇలాగే కొనసాగితే ఈనెల చివరిలోగా వరినట్లు ప్రారంభించాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు. అదేవిధంగా ఫర్టిలైజర్లు లో కాంప్లెక్స్ సెల్లు అయినటువంటి డిఏపి, యూరియా, విత్తనాలు, అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రాల్లో విత్తనాలతో పాటు ఎరువు కూడా అందుబా టులో ఉన్నాయని తెలిపారు. వర్షాలు కురిస్తేనే అన్ని రకాల వ్యాపారాలు సజావుగా సాగుతాయని నిపుణులు సైతం పేర్కొంటున్నారు. రాత్రి కురిసిన వర్షం వల్ల పాడి గేదెలు, ఆవులు చేరుతీర్చుకుంటున్నాయి. ఇది వరకు ఎండలో మండి తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజలు ఒక్కసారిగా రాత్రి కురిసిన వర్షానికి ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో వరి తర్వాత సోయా, మొక్కజొన్న, పెసర,కంది కుసుమ పంటలకు ప్రాముఖ్యతను ఇస్తారు. నిన్న రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడం కాకుండా వారం రోజులపాటు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో ఆరుతడి పంటలు అయినటువంటి మొక్కజొన్న, సోయా వేసుకునే రైతులు పంటలు వేసుకోవచ్చు అని వ్యవసాయ పేర్కొంటున్నారు. ఇప్పటి నుంచైనా వర్షాలు బాగా కురిసి చెరువులు కుంటలు నిండి నిజామాబాద్ జిల్లాలో అనుకున్న దానికంటే వరి సాగుతుందని వ్యవసాయ అధికారులు సైతం అంచనాకు వస్తున్నారు. ఇదిలా ఉండగా రానున్న వారం రోజుల్లో కురిసే వర్షాలకు నిజామాబాద్ జిల్లా వరప్రదాయనిలు గా పేరుగాంచిన ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టులు, నిండుకొని ఆయకట్టు రైతులో మరింత ధీమాను నింపుతాయని ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులు ఆశగా ఎదురుచూ స్తున్నారు. గత ఏడాది కురిసిన వర్షాలకు ఎస్సారెస్పీ,నిజాంసాగర్ ప్రాజెక్టులు నాలుగైదు సార్లు నిండుకుండల్లా మరి వరద నీరును కిందికి వదిలారు. ప్రస్తుత ఖరీఫ్లో వర్షాలు బాగా కురిసి ప్రాజెక్టులు నిండుతాయని రైతన్నలు ఆశగా ఉన్నారు.

# ఆర్మూరా.. మజాకా..?

- సెక్యూరిటీ మధ్య బీజేపీ నేత రాకేశ్‌రెడ్డి...
- రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం.. ఆర్మూర్ పాలిటిక్స్.



**నిజామాబాద్ బ్యూరో - విశాల భారతి :** ఆర్మూర్ చిన్న నియోజకవర్గం. కానీ ఇక్కడి రాజకీయాలే వేరు. అధికార పార్టీ అంటే ప్రతిపక్షాలకు హడలు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అంటే దడ. నాతో పెట్టుకోకు అనే రేంజ్‌లో ఆయన ప్రతిపక్షాలపై వ్యవహారం చేలా తీరుంటుంది. కొన్ని సందర్భాల్లో బాహాటంగానే బెదిరింపులుంటాయి. హెచ్చరికలుంటాయి. అలాంటిది మరోసారి జీవన్‌రెడ్డి ఆర్మూర్ బరి నుంచి పోటీలో నిలిచేందుకు రెడీ అయ్యాడు. ముచ్చటగా మూడోసారి గెలిస్తే మంత్రి చాన్స్ నాకే అని కూడా ప్రచారం చేసుకుంటున్నాడు. సరే, ఇదంతా ఒకవైపు. మరోవైపు ఇక్కడ మొన్నటి వరకు ప్రతిపక్షం లేదు. కాంగ్రెస్ నుంచి ఇప్పటి వరకు అభ్యర్థే దిక్కు లేదు. బీజేపీ నుంచి వినయ్‌రెడ్డి నేనే పోటీ చేస్తున్నా అని ఆశలు పెట్టుకున్నా.. అర్వింద్.. బీజేపీ అధిష్టానం మొన్న అంకాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త రాకేశ్‌రెడ్డిని బరిలోకి దింపింది. దాదాపుగా తనే ఆర్మూర్ నుంచి పోటీ చేస్తున్నట్టు గా పార్టీ అధిష్టానం పరోక్ష సిగ్నల్స్ కూడా ఇచ్చింది. ఆ రేంజ్‌లోనే ఆర్మూర్ నియోజకవర్గానికి భారీ ర్యాలీతో వచ్చాడు రాకేశ్‌రెడ్డి. ఆర్మూర్ చౌరస్తాలో జీవన్‌రెడ్డికి సవాల్ విసిరి రాజకీయంగా యుద్ధానికి రెడీ అయ్యాడు. మొన్న నందిపేట్‌కు చెందిన కొందరిని పార్టీలోకి తీసుకున్నారు. రాజకీయం ఇక్కడ రంజుగా మారింది. ఎక్కడా ఏ నియోజకవర్గంలో ఇంకా టికెట్లే కన్ఫాం కానీ పక్షంలో.. పెద్దగా ఎన్నికల వాతవారణం వేడెక్కినట్టు కనిపించకపోయినా.. ఆర్మూర్‌లో మాత్రం బీఆరెస్, బీజేపీ జోరు నడుస్తుంది. ఈ విషయాలన్నీ అందరికీ తెలిసివనే కానీ.. అందరూ గమనించని ఓ కొత్త విషయమొకటుంది. అదేంటంటే.. రాకేశ్ రెడ్డి నేషనల్ సెక్యూరిటీ ఫోర్స్‌ను నియమించుకున్నాడు. ఓ నలుగురు సాయుధ సెక్యూరిటీ నల్లటి యూనిఫాంలో అతని వెంటే తిరుగాడుతారు. డేగ కన్నుతో అతన్నే ఫాలో అవుతారు. వీరే కాక మరో నలుగురు ప్రైవేటు సైన్యాన్ని కూడా రాకేశ్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్నాడు. ఎందుకంటారా..? ఇంకా అర్థం కాలేదా..? ఆర్మూరా మజాకా..? జీవన్‌రెడ్డితో ఢీ కొట్టడమంటే అంత వీజీ అనుకుంటున్నారా..? ఓట్లు ఊరికే రావు... ఎన్నికల్లో నిలబడాలంటే అదీ ఆర్మూర్‌లో అయితే .. అంతే.

# జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**సూర్యాపేట - విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23 వేల మంది జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు.శనివారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల సమస్యలన్నీ వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చి పది సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు ఎక్కడా సంపూర్ణ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో అక్కడక్కడ ఇంటి స్థలాలు ఇస్తున్నట్లు తెలుస్తున్నప్పటికీ,అవి అక్కడక్కడ సమస్యలుగా తయారవుతున్నాయని వాటి పరిష్కారం చూపుతూ ఇంతవరకు ఇంటి స్థలాలు తీసుకొనని జర్నలిస్టులకు వెంటనే ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి జర్నలిస్టు కుటుంబానికి అన్ని ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యే విధంగా రూపాయి ఖర్చు లేకుండా హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో జర్నలిస్టు భవనాలు నియోజకవర్గ కేంద్రాల్లో ప్రెస్ క్లబ్లు నిర్మించి జర్నలిస్టుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టాలని తెలిపారు.చిన్న మీడియా పెద్ద మీడియా అని తేడా లేకుండా వర్కింగ్ లో ఉన్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని లేని పక్షంలో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు.అనంతరం అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కు వినతి పత్రం అందించారు. సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎల్పీ నాగబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధూపాటి శ్యాంబాబు,రాష్ట్ర కోశాధికారి వంగాల వెంకటాచారి,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం బాలు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘువరన్ ఆచార్యులు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గట్టిగుండ్ల రాము,ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చిలుకల చిరంజీవి, ఉమ్మడి నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొరివి సతీష్ యాదవ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి సైదులు, సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు బరిగల విజయకుమార్, సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్ర రాజు, హుజూర్నగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిలుకల సైదయ్య హుజూర్నగర్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ పిడమర్తి రాజు, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు పడిసిరి వెంకట్,సూర్యాపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ధరావతు సూర్యాపేట నియోజకవర్గ కార్యదర్శి మర్యాద సోమ సోమయ్య పట్టణ కోశాధికారి తిరుపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



# కౌశిక్ రెడ్డిపై ముదిరాజుల గరంగరం..

**నిజామాబాద్ బ్యూరో- విశాల భారతి** ముదిరాజులను కులం పేరుతో దూషించిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ఖబర్దార్ అని.. వెంటనే ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు యాసడి నర్సింగ్ అన్నారు. శనివారం నిజామాబాద్ నగరంలోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ముదిరాజ్ కులస్తులను అవమాన పరుస్తూ కులం పేరుతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ముదిరాజులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ధర్నా చౌక్ లో పెద్ద ఎత్తున ధర్నా చేసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్ కులస్తులు దగ్ధం చేసి మాట్లాడారు. ఈనెల 22న హుజురాబాద్ నియోజకవర్గంలో మున్సిపల్ సిబ్బంది అమరవీరుల స్తూపం కూల్చివేత సందర్భంగా ఒక మహిళ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డితో సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపిస్తుండగా.. అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ యూట్యూబ్ ఛానల్ ముదిరాజ్ కులస్తుడు అక్కడ విషయాలు వీడియో తీస్తుండగా ఇది గమనించిన ఎమ్మెల్సీ.. కెమెరాని లాక్కోవడంతో పాటు అతన్ని కులం పేరుతో దూషించి బెదిరించారని ఆరోపించారు. అక్కడ ఏం జరిగినా కానీ ముదిరాజులను కులంపేరుతో దూషించడాన్ని ముదిరాజ్ కులస్తులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని, వెంటనే ముదిరాజులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 52 లక్షల ముదిరాజులు ఏకతాటిపైకి వచ్చి ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు కరాటే రమేష్ కుమార్, ముదిరాజులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## హోప్ ఫౌండేషన్ సేవలు భేష్

**శేరిలింగంపల్లి-విశాలభారతి :** విద్యార్థులకు చేయూతనివ్వందచడంలో హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రభుత్వ విప్ , శేరిలింగంపల్లి ఏమ్మెల్యే అరేకపూడీ గాంధీ కొనియాడారు. శనివారం హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో హోప్ ఫౌండేషన్ ఆద్వర్యంలో శేరిలింగంపల్లికి చెందిన నాలుగురు విద్యార్థి, విద్యార్థులైన రిషి 9 వ తరగతి , భార్గవి 10 వ తరగతి మహేందర్ 8 వ తరగతి , రిషిత 9 వ తరగతి వరకు రూ 1 లక్ష రూపాయలను ఫీజు నిమిత్తం గాంధీ చేతుల మీదుగా ఆందచేశారు.అనంతరం విద్యార్థులకు భవిష్యత్తులో రాణించాలంటే చేపట్టాల్యిన పలు విషయాలను తెలియచేశారు.ప్రతి వారంలో కనీసం 3 నుండి 4 గంటలు యెగా చేయాలని, ఏదైనా క్రీడలో క్రమశిక్షణతో రాణించే విధంగా ముందుకు సాగాలని కోరారు.హోప్ ఫౌండేషన్ ఆద్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో బాగంగా 35 శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో గాంధీ పాల్గొన్ని వడ్డించారు . ఈ కార్యక్రమంలో భారాస నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ , దొంతి శేఖర్ , కంది గ్నానేశ్వర్ , లయన్స్ క్లభ్ సభ్యులు మహిపాల్ రెడ్డి , మారం వెంకట్ , నూకల సందీప్ , మధూసూధన్ రెడ్డి, సదాశివుని విజయ్ కుమార్ , మారం ప్రసాద్ , ఏన్నె సందీప్ , ప్రముఖ జర్నలిస్టు వినయ్ కుమార్ పుట్ట, శంకర్ , శర్ఫుద్దీన్ పాల్గొన్నారు .

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన శేపూరి రవీందర్

**చిట్యాల - విశాలభారతి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాష్ట్ర నాయకులు మాజీ జెడ్పీటీసీ శేపూరి రవీందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శేపూరి రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా బాధ్యతలు ఇచ్చిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ కి ,మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్య గౌడ్ కి ,మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి,కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు కంకణాల శ్రీధర్ రెడ్డి, పివి శ్యామ్ సుందర్ రావు కి ధన్యవాదాలు తెలుపుతున్నానని నకిరేకల్ నియోజకవర్గం లో బీజేపీ జెండా ఎగిరే వరకు కృషి చేస్తూ ప్రతి బీజేపీ కార్యకర్తను కాపడుతానని , అహర్నిశలు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. శేపూరి రవీందర్ ని రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక చేయడం పట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపు బుద్ధుడు వర్షం వ్యక్తం చేశారు. నకిరేకల్ నియోజకవర్గం లో బిజెపి పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.




# 'ప్రభుత్వం పేదలను రోడ్డున పడేస్తోంది'

**రంగారెడ్డి బ్యూరో - విశాలభారతి :** తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి కోట్లు రూపాయలు కొల్లగొడుతూ, పేదలను మాత్రం రోడ్డున పడేస్తోందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల యాదయ్య ఆరోపించారు. ప్రజాసంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పగడాల యాదయ్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో పేదలు కనీసం 60 గజాల భూమి కొని, ఇల్లు కట్టుకోలేని దారుణస్థితి నెలకొని ఉందన్నారు. అలాంటి అర్హులైన పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొంటే... వారిపై లాఠీచార్జ్ చేసి జైళ్లలో పెట్టడం హేయమైన చర్యగా అభివర్ణించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులని చూడకుండా అర్థరాత్రి దారుణంగా హింసించారన్నారు. కేసీఆర్ సర్కార్ పేదల భూములను అప్పనంగా లాక్కొని యథేచ్ఛగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. మరోవైపు భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మలిచి అమ్ముకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, వెనుకబడిన బీసీ కుటుంబాలకు రూ.లక్ష సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజు, ఏర్పుల నర్సింహ, గోరెంకల నరసింహ, కనకయ్య, వెంకన్న, ఆలంపల్లి మహేష్, గుండె శివకుమార్, పి. శ్రీనివాస్, సర్వయ్య, మల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ను బర్తరఫ్ చేయాలి

**శేరిలింగంపల్లి-విశాలభారతి :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం సభ్యులు,హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఓబీసీ విద్యార్థి సంఘం నాయకులు కలిసి శనివారం పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మదగ్ధం చేశారు. అంతకు ముందు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గెట్ ముందు కౌశిక్ రెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముదిరాజ్ లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత స్థానంలో ఉన్న కౌశిక్ రెడ్డి అహంకార ధోరణితో ఒక యూట్యూబ్ కెమెరామెన్ ఐన ముదిరాజ్ బిడ్డను అసభ్య పదజాలంతో ధూషించడంతో పాటు దాడి చేయడం క్షమించరాని నేరమని ముక్తకంఠంతో నినదించారు. యావత్ ముదిరాజ్ జాతిని కించపరిచేలా మాట్లాడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ లతో పెట్టుకున్న కౌశిక్ రెడ్డికి తగిన బుద్ధి చెప్తామని,కెసిఆర్ స్పందించి ఆయనను బర్తరఫ్ చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా తమ నిరసనలు తెలియజేసి కౌశిక్ రెడ్డిని రోడ్లమీదకు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. బిసిల ఐక్యత, ముదిరాజ్ ల ఐక్యత వర్ధిల్లాలి, కౌశిక్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. భవిష్యత్తులో ఎవరు ముదిరాజ్ ల జోలికొస్తే ఊరుకునేది లేదని, తమ ప్రతాపమేంటో చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు,, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి సాయం'

**తుర్కయంజాల్, విశాల భారతి** బ్రాహ్మణపల్లిలో గుండెపోటుతో ఆకస్మికంగా చనిపోయిన రైతు పసుల సత్యనారాయణ కుటుంబానికి తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం తరపున రూ.25వేల తక్షణ సాయాన్ని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ తుర్కయంజాల్ ఎఫ్ఎస్‌సీఎస్ ఎల్లప్పుడూ రైతులకు, రైతు కుటుంబాలకు అండగా నిలబడుతుందన్నారు. బాధిత కుటుంబానికి రైతుబీమా త్వరలోనే అందేలా అధికారులతో మాట్లాడతామన్నారు. సహకార సంఘంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి రైతుకు అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, బ్యాంకు వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు సామ సంజీవ రెడ్డి, కొండ్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, కౌన్సిలర్ కొండ్రు మల్లేశ్, బ్యాంకు సెక్రటరీ వై.రాందాస్, నాయకులు మద్రిసంపతీశ్వర్‌రెడ్డి, ఏనుగు అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**నూతనకల్ - విశాలభారతి :** టి పి సి సి ఉపాధ్యక్షులు రామ్ రెడ్డి దామోధర్ రెడ్డి సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్,ఎన్ ఎస్ యు ఐ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్ ఆదేశాల మేరకు నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి అధ్వర్యం లో నూతనకల్ మండలంలోని వివిధ గ్రామాలాలో గ్రామ కమిటీలు వేయడం తో పాటు రాజీవ్ క్విజ్ పోటీల పాల్గొనే విధంగా ప్రతి కార్యకర్త చూడాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ లోపేతానికి కృషిచేయాలని అలాగే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపేలక్ష్యంగా పనిచేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నూతనకల్ మండల ఇంచార్జి కొండగడుపుల ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం కృష్ణారెడ్డి, తీగల గిరిధర్ రెడ్డి, కాస రంగయ్య, జటంగి గణేష్ యాదవ్, ఎన్ ఎస్ యు ఐ మండల నాయకులు మరికంటి అశోక్, ఉప్పల.శీను యాదవ్, మడ్డి.శ్రావణ్ గౌడ్, నకరికంటి.మహేష్, మరికంటి.వంశీ, నకరికంటి. ఉపేందర్, మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది...

# రాజగోపాల్ కాంగ్రెస్‌లోకి ఎందుకు..



**నిజామాబాద్ బ్యూరో- విశాల భారతి :** కాంగ్రెస్ పార్టీలోకి షర్మిల, రాజగోపాల్ రెడ్డి చేరుతున్నారనే ప్రచారంపై మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్ రెడ్డి పార్టీ కోసం వస్తున్నారా లేక కాంట్రాక్టుల కోసం వస్తున్నారా చెప్పాలన్నారు. కాంగ్రెస్‌ను వీడిన వారు తిరిగి పార్టీలో చేరుతామని వస్తే అలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తిరిగి పార్టీలోకి ఎవరైనా వస్తామంటే స్థానిక నాయకులతో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకుంటే పార్టీ కోసం తమ శక్తినంత ఒడ్డిన వారికి అన్యాయం జరుగుతుందన్నారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లోకి వస్తే మంచిదేనని నిజానికి షర్మిల కుటుంబం కాంగ్రెస్ కుటుంబమే అని వ్యాఖ్యానించారు. కొత్త వారితోనే పార్టీ గెలుస్తుందనుకుంటే పొరపాటు అవుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీల కుట్రలు గ్రహించాలన్నారు. కాగా, చేరికల విషయంలో మధుయాష్కీ గౌడ్ వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి.

# మోడీ హయాం లో గతం లో ఎన్నడూ లేనంతగా గ్రామాల అభివృద్ధి

**నారాయణఖేడ్ లో విస్తృతంగా ఇంటింటికి బిజెపి కార్యక్రమం**

**నారాయణఖేడ్- విశాల భారతి** జన్ సంపర్క్ అభియాన్ లో భాగంగా రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షులు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు "ఇంటింటికీ బీజేపీ" కార్యక్రమం నారాయణ ఖేడ్ లోని నేఫ్లీమేట్ గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప పాల్గొన్నారు. గడప గడపకు తిరుగుతూ రాష్ట్రంలో ప్రజలకు కేంద్రము నుండి అందుతున్న సంక్షేమ పథకాలను బిజెపి నాయకులు వివరించారు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే బీఆర్ఎస్ అమ్ముడు పోతారన్నారు. మోడీ నాయకత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని సంగప్ప అన్నారు. కార్యక్రమం లో పార్టీ సీనియర్ నేతలు సాయిరాం, సంజు పాటిల్, రాజు గౌడ్ తో పాటు నమ్లిమేట్ బీజేపీ నాయకులు మహేష్, శివ, జైపాల్, కూర్మ రాజు, దత్తు, రజినీకాంత్ తో పార్టీ నాయకులు పాల్గొన్నారు.





## బాల్కొండ అభివృద్ధిని ఎవరు ఆపలేరు

- క్రషర్,కాంట్రాక్టులు అన్ని మీకే అప్పజెప్తా,దమ్ముంటే వచ్చి చేయండి
- అన్ని బట్ట కాల్చి మీద వేసే మాటలే,ఏ ఒక్కదానికి ఆధారం లేదు
- నా మీద ఆరోపణలను నిరూపించాలి,లేకుంటే ముక్కు నేలకు రాయాలి
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**బాల్కొండ - విశాలభారతి :** బాల్కొండ మండలంలో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన,ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.బాల్కొండ మండల కేంద్రంలో 50 లక్షల వ్యయంతో నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవం,నూతనంగా నిర్మించిన కేజీబివి స్కూల్ ప్రారంభోత్సవం (వన్నెల్ రోడ్),కిసాన్ నగర్ గ్రామంలో బాల్కొండ నుండి ముప్కాల్ వరకు 1.3కోట్ల వ్యయంతో బి.టి రోడ్ పునరుద్ధరణ,నాగాపూర్ నుండి గోదావరి రివర్ వరకు 1.15 కోట్ల వ్యయంతో బిటి రోడ్ ఫార్మేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను ఉండగా బాల్కొండ అభివృద్ధిని ఎవరు ఆపలేరని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఎవరు అడ్డు వచ్చిన అభివృద్ధి ఆగే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.సీఎం కేసీఆర్ సహకారంతో 114 కోట్లతో బాల్కొండ గ్రామం అన్ని విధాల అభివృద్ధి చేసుకున్నామని గణాంకాలతో సహా మంత్రి వివరించారు. తాను అభివృద్ధి కోసం తాపత్రయ పడుతుంటే బీజేపీ, కాంగ్రెస్ నేతలు కమిషన్లు తింటున్నానని అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి కోసం కష్టపడుతున్న నన్ను కమిషన్లు తిన్నవని నిరాధార ఆరోపణలు చేస్తున్నరు.తన తమ్ముడు గంజాయి అమ్ముతున్నరని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని గంజాయి అమ్మాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు.ఈ మాటలు వింటుంటే ఒక్కోసారి బాధ అనిపిస్తుందని తన ఆవేదన వ్యక్తంచేశారు. బాల్కొండ నియోజకవర్గంలోనే అత్యధికంగా గంజాయి కేసులు అయ్యాయని తాను అదిలాబాద్ ఎస్పీ,జిల్లా పోలీసు వాళ్ళను పలుమార్లు ఆదేశిస్తే,కఠినంగా వ్యవహరిస్తే గంజాయి వాడకం తగ్గిందని చెప్పారు.గంజాయి నిర్మూలన కోసం తాను పనిచేస్తే మేమే అమ్ముతున్నమని నిరాధార ఆరోపణలు చేస్తూ మా కుటుంబాన్ని బద్నాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక క్రషర్ లో 400 కోట్లు సంపాదించారని ఆరోపణ చేస్తున్నారు.తాను తన బంధువులకు చెప్పి 10 కోట్లకే ఆ క్రషర్ ఇప్పిస్తానని ఆరోపణలు నిరూపించాలని సవాల్ చేశారు.వందల కోట్ల కాంట్రాక్టులు కమిషన్లు అని మాట్లాడుతున్నారు ఇంకా నియోజవర్గంలో 300 నుంచి 400 కోట్ల వర్క్ చేయడానికి రెడీగా ఉన్నది. అందులో 100 నుంచి 150 కోట్లు బీజేపీ నేతలు చెప్పిన వారికే ఇస్తా కాంట్రాక్టుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టులు అన్ని మీకే అప్పజెప్తా, దమ్ముంటే వచ్చి చేయండని సవాల్ విసిరారు. అన్ని బట్ట కాల్చి మీద వేసే మాటలే,ఏ ఒక్కదానికి ఆధారం లేదని అన్నారు.నా మీద ఆరోపణలను వారంలో నిరూపించాలి.లేకుంటే ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా అభివృద్ధి చేసే వారు ఎవరో, రెచ్చగొట్టే వారెవరో దయచేసి గమనించాలని విజ్ఞప్తి చేశారు.బీజేపీ మాయ మాటలు నమ్మితే గోస పడతామని వివరించారు. బీజేపీ నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఉప్పు,పప్పు, నిత్యావసరాల ధరలు పెంచి సామాన్యులను గోస పెడుతున్నారని గుర్తు చేశారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.అనంతరం భీమ్‌గల్ మండలం పిప్రి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.5కోట్ల వ్యయంతో నిర్మించే పిప్రి నుండి ముచ్కూర్ డబుల్ రోడ్ పనులకు శంకుస్థాపన,పిప్రి నుండి లొద్ది రామన్న టెంపుల్ ఫార్మేషన్ 3.2 కోట్ల వ్యయంతో తాండ వద్ద శంకుస్థాపన,75లక్షలతో టెంపుల్ వద్ద స్లాబ్ కల్వర్ట్ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతుందని మంత్రి వేముల చెప్పారు.అందులో భాగంగా భీమ్‌గల్ మండలం పిప్రి గ్రామంలో పలు అభివృద్ధి పనులకి ఆహ్లాదకరమైన వాతావరణంలో శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అన్నయ్య గౌడ్ జాగ్రత్త..



**విశాలభారతి - సుల్తానాబాద్:** కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య గౌడ్ 10వ వార్డులో జరిగిన గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో మాట్లాడిన తీరును ప్రజలు ఏమాత్రం విశ్వసించరని కౌన్సిలర్లు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని పదవ వార్డులో కౌన్సిలర్ అనుమాల అరుణ బాబురావు నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. గతంలో సర్పంచిగా ఉన్న సమయంలో చేసిన అవినీతి అక్రమాల చిట్టాను త్వరలో బయటపెట్టుతామని స్పష్టం చేశారు. సర్పంచిగా ఉన్న సమయంలో 31 లక్షల రూపాయల దుర్వినియోగం చేసినప్పుడు ఎక్కడికి వచ్చి ప్రాధేయపడ్డావో మరిచిపోయావా. ఒక్కసారి గుర్తు తెచ్చుకో..అలాంటి వ్యక్తివి. కౌన్సిలర్లు, పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పై ఆరోపణలు చేసే స్థాయి నీకు ఉందా అని వారు ప్రశ్నించారు.సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సేవలను చూసి నీవే ఆస్పత్రి సేవలు బాగున్నాయని మెచ్చుకున్న నీవు.. నేడు విమర్శించడం ఏమిటని ఓటమిపాలై ఏం మాట్లాడుతున్నావో నీకే అర్థం కావటం లేదని అన్నారు. కౌన్సిలర్ గా ఓడిపోయినా నీవు సింగిల్ విండో డైరెక్టర్ గా రెండు స్థానాలకు పోటీ చేసిన నిన్ను మీ కుటుంబాన్ని ప్రజలు విశ్వసించలేదని, ఓటమిపాలైనగాని నీ ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రావడం లేదని ఆరోపించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అయిదు కోట్ల నిధులను మంజూరు చేస్తే కాంట్రాక్టర్ల అవతారమెత్తి నాసిరకం పనులు చేసి బిల్లులు తీసుకున్న సిసి రోడ్లపై క్వాలిటీ కంట్రోల్ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లను తరిమికొడతానని మాట్లాడిన నిన్ను రానున్న రోజులలో ప్రజలే నిన్ను తరిమికొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పై అనవసరమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని కౌన్సిలర్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, కౌన్సిలర్లు పారుపెల్లి జ్ఞానేశ్వరి గుణపతి, గొట్టం లక్ష్మి, కౌన్సిలర్ రేవల్లి తిరుపతి, బి ఆర్ఎస్ నాయకులు గాజుల రాజమల్లు, పసిడ్ల సంపత్, గొట్టం మహేష్, బిరుదు కృష్ణ, రఫీక్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కార్పోరేటర్ జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి- విశాలభారతి :** కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ జన్మదిన సందర్భంగా శాలువాతో సత్కరించి పూల బొకేతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీ ఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు చాంద్ పాషా, డివిజన్ అధ్యక్షులు కృష్ణ గౌడ్. సీనియర్ నాయకుడు తిరుపతి యాదవ్ శ్రీరామ్నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శివ కుమార్,జర్నలిస్ట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపాక ముత్తయ్య మృతి బాధాకరం

**మునగాల - విశాలభారతి :** బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్లపాక ముత్తయ్య మృతి బాధాకరమని కోదాడ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం మునగాల మండలం ఆకుపాముల గ్రామంలో తాళ్లపాక ముత్తయ్య మృతి చెందిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కోదాడ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముత్తయ్య కుటుంబానికి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ రామ్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక , రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం




**మేడిపల్లి - విశాలభారతి :** ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక , రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 26,27,28 తేదీల్లో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బోడుప్పల్ లో జరుగనున్నాయని ఈ శిక్షణ తరగతుల్లో ప్రస్తుతం కేంద్రం లో రాష్ట్రం లో అధికారంలో బీజేపీ, బిఆర్ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ విద్యార్థి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఈ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి మణికంఠ రెడ్డి,, పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం రోజున మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బోడుప్పల్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో విలేకర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ,బిఆర్ఎస్ ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తి విస్మరిస్తూ విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్య కాషాయీకరణ, విద్య ప్రైవేటీకరణ చేస్తూ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ తెలంగాణ విభజన హామీల్లో ఉన్న విద్యా సంస్థ తెలంగాణ కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని జిల్లాకు నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయలు, ఐఐటి ఐఎం లాంటి అనేక అనేక విద్యాసంస్థలు తెలంగాణ కేటాయించకుండా తెలంగాణ విద్యార్థుల పట్ల కక్షపూరితాంగ వ్యవహరిస్తున్నారని రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని ఎన్నికల హామీ అయిన కేజీ నుండి పిజీ వరకు ఉచిత నిర్బంధ విద్య ఇప్పటికీ అమలు కాలేదని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టకుండా, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకుండా, ప్రభుత్వ పాఠశాల కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించకుండా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచకుండా పక్కా భవనాలు నిర్మించకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ లెక్చరర్ అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను సకాలంలో విడుదల చేయకుండా కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతుందని ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై 26,27,28 తేదీల్లో బొమ్మక్ అర్ కన్వేషన్ హాల్ లో జరిగే శిక్షణ తరగతుల్లో చర్చించి విద్యార్థి ఉద్యమ కార్యచరణ రూపొందించడం జరుగుతుందని ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర నలుమూల నుండి ఎంపిక చేయబడిన విద్యార్థి నాయకులు హాజరబోతున్నారని ఈ శిక్షణ తరగతుల జయప్రదానికి విద్యావంతులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు కృషి చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ అన్వర్, హరీష్ ,చిన బాబు, సందీప్,నర్సింహా, తదితరులు పాల్గొన్నారు

## కమర్షియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్ లోకి మార్చాలి

**చిట్యాల - విశాలభారతి :** చిట్యాల గ్రామపంచాయతీ గా ఉన్నప్పుడు కొంతమంది గ్రామపంచాయతీ అనుమతులు తీసుకొని బ్యాంకు లోన్లు తీసుకొని ఇల్లు కట్టుకున్నారు. కానీ చిట్యాల మున్సిపాలిటీ అయిన తర్వాత భువనగిరి రోడ్డుకు ఉన్న 635 సర్వే నెంబర్ లో ఏర్పాటు చేసిన ఇండ్ల స్థలాల వెంచర్ తో పాటుగా మరియు చిట్యాల జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసిన చేసిన వెంచర్ల లో కొనుగోలు చేసిన ఇళ్లస్థలాలు కమర్షియల్ జోన్ లో చేర్చడం వల్ల అనేకమంది పేదలు ఇల్లు కట్టుకోవడానికి మున్సిపల్ అనుమతుల కోసం వెళితే 635 సర్వేనెంబర్ లో ఏర్పాటు చేసిన ఇండ్ల స్థలాలతోపాటుగా చిట్యాల జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న ఏర్పాటుచేసిన వెంచర్ లో ఉన్న ఇండ్ల స్థలాలకు అనుమతులు ఇవ్వకపోవడం వల్ల పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిజెపి జిల్లా నాయకులు చికిలంమెట్ల అశోక్ అన్నారు. వెంటనే ఈ రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు పాత మాస్టర్ ప్లాన్ కమర్షియల్ జోన్ నుంచి వెంటనే తొలగించి కొత్త మాస్టర్ ప్లాన్ ఏర్పాటుచేసి ఇండ్లు కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వాలని చికిలం మెట్ల అశోక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## సంచలన తీర్పు వెల్లడించిన జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సునీత కుంచాల

- నిందితునికి రెండు యావజ్జవ కారాగార శిక్షలు.
- వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు.



**నిజామాబాద్ బ్యూరో- విశాలభారతి :** గత సంవత్సరం క్రితం నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండలం ధర్మారం గ్రామానికి బ్రతుకుతెరువు కోసం వచ్చిన మద్నూర్ మండలం ఎకలార గ్రామానికి చెందిన దేవకట్ట గోవిందరావు అలియాస్ బన్నీ ఐదేళ్ల బాలికను హత్య చేసిన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ సునీత కుంచాల రెండు యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తూ శనివారం సంచలనం తీర్పును వెల్లడించారు. డిచ్పల్లి ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 సెప్టెంబర్ లో మండలం నుండి ధర్మారం గ్రామానికి పాలేరు పనిచేయ డానికి బతుకుదెరువు కోసం వచ్చాడని, అదే గ్రామానికి చెందిన ఇద్దరు కూతుర్లు ఉన్న భర్త లేని మహిళను మాధవ నగర్ సాయిబాబా మందిరంలో పెళ్లి చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పెళ్లి చేసుకున్న ఇద్దరు ధర్మారంలో నే మఖం వేసినట్టు తెలిపారు. రెండు నెలల తర్వాత పెళ్లి చేసుకున్న మహిళ కుమార్తె సైకిల్ పైనుంచి పడగా కాలికి గాయం కాగా డాక్టర్ వద్దకు తీసుకెళ్లినట్టు ఎస్సై వివరించారు. అదేవిధంగా తర్వాత రోజు ఎప్పటిలాగే డాక్టర్ వద్దకు తీసుకెళ్తానని చెప్పి నిర్మానుష ప్రదేశానికి తీసుకుని వెళ్లి ఐదేళ్ల బాలికను హత్య చేశాడు. దీనికి దాదాపు 11 నెల నిరీక్షణ అనంతరం నిందితునికి రెండు యావజ్జీవ శిక్షలు విధిస్తూ నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సునీత కుంచాల సంచలన తీర్పు వెల్లడించారు.ఈ తీర్పుతో ప్రజల్లో మార్పు వస్తుందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రభుత్వ ప్రచారం తప్ప కులవృత్తుల వారికి చేసిందేమీ లేదు

**విశాలభారతి, గండిపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కులవృత్తుల వారికి ప్రోత్సహించేందుకు అందించిన రుణాల పథకం కేవలం ప్రభుత్వ ప్రచారం తప్ప కులవృత్తుల వారికి చేసిందేమీ లేదని నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్ ఉషారాణి ఆరోపించారు. శనివారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రచార ఆర్భాటంలో భాగంగా బీసీ రుణాల పేరిట ప్రకటన జారీ చేసిందన్నారు. సంబరాల పేరిట అధికారులు సిబ్బందిని కార్యాలయాలకు రాకుండా కట్టడి చేసిందన్నారు. కొద్దిరోజుల గడువు ఇచ్చి వివిధ ప్రభుత్వ అధికారులు జారీ చేసిన పత్రాలను జత పరచాలని దరఖాస్తులు తెలిపిందన్నారు. దీంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగి తమ విలువైన సమయంతో పాటు డబ్బును వృధా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నార్సింగి మున్సిపాలిటీలో కేవలం 89 మందికి మాత్రమే రుణాలు అన్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో వేలాదిమంది లబ్ధిదారులు ఉన్నప్పటికీ కేవలం 89 మందికి మాత్రమే అందించారన్నారు. మున్సిపాలిటీ నుండి వేలాదిమంది ఈ సేవ కార్యాలయాలలో 400 నుండి 500 రూపాయలు ఖర్చు చేసి దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. గడువు ముగిసిందని వారి దరఖాస్తులన్నిటిని పక్కకు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు పథకాలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు ప్రజలంతా గమనిస్తున్నారని తగిన గుణపాఠం తప్పక చెబుతారన్నారు.



## రోగులు పండ్లు పంపిణీ

**నూతనకల్ - విశాలభారతి :** రోగులకు పండ్లు పంపిణీ చేయడం అభినందనీయమని మండల వైద్య అధికారిని కీసర ఆశ్రిత రెడ్డి అన్నారు .శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన ఉమ్మడి మండల పిఏసిఎస్,,& సర్పంచ్ కనకటి సునీత వెంకన్నల పెళ్లిరోజు సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో డాక్టర్ కరుణ సాగర్, మారగాని రమేష్ ,ముత్యం ప్రసాద్ ,గుండ గాని మహేందర్ ,కాముని కిరణ్ కుమార్ ,మారగాని మహేష్ ,చల్లమల్ల నరేష్ ,ప్రవీణ్ ,లింగన్న ,గణేష్ మహేష్ తదితరులు పాల్గొన్నారు



## ప్రగతి నివేదిక సభను విజయవంతం చెయ్యండి

**నూతనకల్ - విశాలభారతి :** మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ ఆదేశాలనుసారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ అధ్యక్షులు పులుసు లింగమల్లయ్య అధ్యక్ష వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ జూన్ 27 వ తేదీన తిరుమలగిరిలో జరిగే తుంగతుర్తి నియోజకవర్గ ప్రగతి నివేదన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విచ్చేయనున్నా సందర్భంగా ప్రగతి నివేదిక సభను విజయవంతం చేయాలని చిల్పకుంట్ల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కోరారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి బత్తుల సురేష్ ,సర్పంచి కొంపల్లి రామ్ రెడ్డి, బీ ర్ ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్, బాణాల సత్యనారాయణ రెడ్డి, రామస్వామి మల్ల రెడ్డి, బత్తుల గురవయ్య, బత్తుల ఉప్పలయ్య, బత్తుల వెంకన్న బత్తుల ఎల్లయ్య బత్తుల గాంధీ పంతం మధుకర్, కొంతం కృష్ణారెడ్డి, పంతం కృష్ణయ్య, జటంగి లింగయ్య, పులుసు కనకయ్య, బత్తుల హరికృష్ణ, బత్తుల రామ చంద్రు, బొజ్జ వెంకటేష్, బ్రహ్మాచారి, పులుసు వెంకన్న, పోలేపాక ప్రవీణ్, రమేష్ ..గ్రామ ముఖ్య నాయకులు యూత్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు..

## బిజెపి అధికారంలోకి రాగానే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్
- 61వ రోజుకు చేరుకున్న గడప గడపకు బీజేపీ, రవన్న ప్రజాయాత్ర
- మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా కరపత్రాల పంపిణీ

**శేరిలింగంపల్లి-విశాలభారతి :** గడప గడపకు బీజేపీ, ప్రజల గోస – రవన్న భరోసా ప్రజాయాత్ర విజయవంతంగా కొనసాగుతున్నది. ఇందులో భాగంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఇజ్జత్ నగర్, ఖానమేట్ లలో చేపట్టిన మాహా సంపర్క్ అభియాన్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాల పరిపాలనలో చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ ఇంటి ఇంటికి కరపత్రాలను పంచుతూ, బి.ఆర్.ఎస్ అవినీతిని ప్రజలకు తెలియజేస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పర్యటించారు. ఖానామేట్, ఇజ్జత్ నగర్ కాలనీ వాసులు, స్థానిక నాయకులు, మాదాపూర్ డివిజన్ నాయకులు , నియోజకవర్గ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే, నాయకులు ఈ ప్రాంతానికి చేయకపోగా , సుందరీకరణ పేరుతో మొండి కుంట చెరువు కబ్జా చేస్తున్నారని , ఇప్పటికీ మంజీరా వాటర్ సమస్య అలాగే ఉందన్నారు. ఇనాగరేషన్ అయి సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు రోడ్లు పూర్తి కాలేదని, 9 ఏళ్లలో పెన్షన్లు ,రేషన్ కార్డులు ఒక్కటి కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు.తాము గెలిచిన తదనంతరం పాదయాత్రలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని, పేద ప్రజల అభ్యున్నతికి తోడ్పడుతూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరసింహ యాదవ్, రాధాకృష్ణ యాదవ్, మల్లేష్, కృష్ణ, గోపాల్ గౌడ్, మదనా చారి, మధు యాదవ్ , గోవర్ధన్ రెడ్డి, యాదయ్య, బాలు నాయక్, విష్ణు, నరేష్ , రవి, కుర్మయ్య, శ్రీనివాస రెడ్డి, శివ యాదవ్, పద్మ,భారతి, స్వప్న, చంద్రకళ, నాగులు, రవి ముదిరాజ్, బాబు, గణేష్, రాము, శివరాజ్, వెంకటేష్, వంశీ , పవన్, సూర్య, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## విట్టల్ రావును పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు.

**నిజామాబాద్ బ్యూరో విశాల భారతి.** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివ నగర్ మండలం పద్మాజివాడి మాజీ సింగిల్ విండో చైర్మన్ విట్టల్ రావు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న సదాశివనగర్ మండల మాజీ జెడ్పిటిసి బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పడిగేల రాజేశ్వరరావు స్థానిక సింగల్ విండో చైర్మన్ గంగాధర్ బిఆర్ఎస్ నాయకులు గైని రమేష్ యాచారం గ్రామానికి చెందిన రమేష్ నాయక్ భూంపల్లి గ్రామ మాజీ అధ్యక్షుడు రాజేందర్ తో కలిసి వారుమర్శించారు.గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం పొంది ఇంటికి రావడం తో వారి గ్రామానికి వెళ్లి పరామర్శించి వారి కుమారులతో మాట్లాడారు. ఆరోగ్యపరమైన విషయాలను తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ద్వారా ఇప్పటివరకు వైద్యం కోసం అయినా ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మళ్లీ వైద్యం అవసరం పడితే ఎలాంటి సహకారాన్ని కోరిన అందివ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

**విశాలభారతి -గండిపేట్ :** నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని హార్టికల్చర్ అధికారి నిఖిల్, ఆర్యన్ స్కూల్ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలోని ఆర్యన్ స్కూల్లో హార్టికల్చర్ అధికారి నిఖిల్ తో కలిసి ఆర్యన్ స్కూల్ చైర్మన్ మహేందర్ రెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొక్కలు నాటడమే కాదు మొక్కలను ఇంట్లో మన పిల్లల్ని ఎలా చూసుకుంటామో మొక్కలను కూడా అదే విధంగా సంరక్షిస్తే మనకు ఆరోగ్యపరంగా, ఎన్నో రకాలుగా చెట్లు ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. అలాగే ప్రతి ఒక్కరు పుట్టినరోజు నాడు ఒక మొక్కను నాటడం అలవాటు చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామా, ప్రిన్సిపల్ సచిన్ జైస్వాల్, ఆర్యన్ స్కూల్ అడ్మిన్ వాణి, అనిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# మానుకోటపై సైకిల్ జెండా ఎగరాలి

- టీడీపీ కి పూర్వవైభవం కోసం ఐక్యంగా పనిచేయాలి.
- మహబూబాబాద్ నాయకులకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆదేశం.



**హైదరాబాద్,విశాల భారతి:** పార్టీలో అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి ఈసారి మానుకోటలో సైకిల్ జెండాను ఎగురవేయాలని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సూచించారు.శనివారం ఎన్టీఆర్ భవన్లో మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంకు చెందిన వివిధ అనుబంధ సంఘాల నాయకులు జ్ఞానేశ్వర్ ను కలిశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ పూర్తిస్థాయి పార్టీ కమిటీని వేసినందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ... మహబూబాబాద జిల్లాలో తెలుగుదేశం పార్టీకి మంచి పట్టు ఉందని నాయకులు పార్టీ కేడర్ ను ప్రజలకు అనుసంధానం చేసుకొని వారి మద్దతును పొందదానికి కృషి చేయాలన్నారు. టీడీపీ హయాంలోనే గిరిజన ప్రాంత ప్రజలకు అన్ని విధాలా న్యాయం జరిగిందని అందుకే ఆ ప్రాంత ప్రజలంతా తెలుగుదేశం వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ద్వారా మంచి జరుగుతుందని పార్టీలోకి వచ్చే వారందరినీ స్వాగతించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిన్న పాటి సమస్యలున్నా అందరినీ కలుపుకొని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని నాయకులను ఆదేశించారు.. తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందని నాయకులందరూ సమిష్టి కృషితో పనిచేసి.. పార్టీ విజయానికి నాంది పలకాలని నాయకులకు సూచించారు. టీటీడీపీ అధ్యక్షుడిని కలిసిన వారిలో ప్రేమ్ చంద్ వ్యాస్, కె. ఐలయ్య, బొమ్మ వెంకటేశ్వర్లు, ఏషబోయిన ఎల్లయ్య యాదవ్, జీ భీమా నాయక్, రాంరెడ్డి, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ పర్పస్ విధానం పై ప్రభుత్వం స్పందించాలి




**భద్రాద్రికొత్తగూడెం - విశాలభారతి :** కనీస వేతనం రూ 26 వేల రూపాయలు,మల్టీ పర్పస్ విధానం పై ప్రభుత్వం స్పందించకపోతే జూలై 6 నుండి జరిగే నిరవధిక సమ్మె కి సిద్ధమవుతామని రాష్ట్ర జే ఏ సి కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, జిల్లా జేఏసి చైర్మన్ ఎ.జె. రమేష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 50 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే జూలై 6 నుండి నిరవధిక సమ్మె కి సిద్ధం అవుతున్నామని రాష్ట్ర JAC కన్వీనర్ మధుసూధన్ రెడ్డి,జిల్లా JAC చైర్మన్ ఎ.జె. రమేష్ తెలిపారు. స్థానిక సి ఐ టి యు జిల్లా కార్యాలయం లో గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా సదస్సు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా సమ్మె సన్నాహక సదస్సు లో మధు సుదన్ రెడ్డి, ఎ. జె.రమేష్ లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఏడు క్యాటగిరిలకు చెందిన కార్మికులను వారి క్యాతగిరి లను రద్దు చేసి తీసుకువచ్చిన మల్టీ పర్పస్ విధానం కార్మికుల పాలిట మరణ శాసనం లాగా తయారైందని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు కి అనుగుణంగా వేతనాలు 26 వేలు ఇవ్వాలని లేని యెడల పి అర్ సి లో మినిమం బేసిక్ వేతనం గా ఉన్న 19 వేల రూపాయలు ఇవ్వాలని,లేదా మున్సిపల్ కార్మికుల జీఓ 60 అయినా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు విధుల్లో ఉండి చనిపోయిన కార్మికులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని,10 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని,మట్టి ఖర్చులకు 30 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా లాంటి క్లిష్ట సమయంలో ప్రజల ప్రాణాలను కంటికి రెప్పలా చూసుకున్నారని,దశాబ్ది ఉత్సవాల లోకొద్ది మంది కార్మికులకు సన్మానాలు చేస్తే మొత్తం కార్మికులకు కడుపునిండదని అన్నారు. వారాంతపు సెలవులు,ఆదివారం,పండుగ సెలవులు లేకుండా కార్మికులు తో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. పిఎఫ్ఇఎస్ఐ,ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాకలెక్టర్ కార్యాలయం లో జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయం లో సమ్మె నోటీస్ నీ సిసి కి అందజేశారు. ఈ కార్యక్రమం లో జే ఏ సి జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి సురేష్,మేక వెంకట నర్సయ్య,యుసఫ్, జె.వెంకన్న,జిల్లా కో కన్వీనర్ సాయి రత్న,శామ్యూల్, నరసింహారావు, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదాపూర్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్ జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి- విశాలభారతి :** ప్రజల మనిషి,పేదల పెన్నిధి ప్రజలే నాయకులు,నాయకుడే సేవకుడు అని భావించిన ప్రజా సేవకూడు,ఎంతో మంది యువతకు ధైర్యం,నడిపించే శక్తి,ప్రజల మనిషిగా ప్రజా సేవకై నిరంతరం శ్రామిస్తున్న నాయకూడు శ్రీ కృష్ణ యూత్ వ్యవస్థాపకులు,మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం నల్లగండ్ల గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కలు నాటారు.అనంతరం హాఫీజ్ పెట్,మాదాపూర్ డివిజన్ పరిధిలోని శాంతి నగర్,గంగారాం,గోకుల్ ప్లాట్స్,కనమేట్,ఇజత్ నగర్,చంద్ర నాయక్ తండా నందు ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే శాంతి నగర్ నివాసితులు రాజు కుమార్తెలు ఇంటర్ మొదటి సంవత్సరం చదువు నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు శ్రీ కృష్ణ యూత్ సభ్యులు .ఈ కార్యక్రమంలో వివేక్ గౌడ్,చైర్మన్ శ్రీనివాస రెడ్డి,బాలరాజ ముదిరాజ్, అధ్యక్షులు భీమని ఆదిత్య ముదిరాజ్,సభ్యులు బాలకృష్ణ,ప్రవీణ్,మనోజ్,కృష్ణ గౌడ్, సయ్యద్ గౌస్, పి.విజయందర్ రెడ్డి, యాదగిరి,లక్ష్మణ్,శివ కుమార్ గౌడ్,శైలేష్,క్రాంతి, భాస్కర్,జగదీష్,మల్లేష్,శివనంద్ రెడ్డి,అభిలాష,వంశీ కృష్ణ,శ్రీకాంత్ యాదవ్,,మూర్తి,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

- సమస్యల పరిష్కరించాలని దశలవారీ ఆందోళనలు
- కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు




**మణుగూరు - విశాలభారతి :** ఉత్పత్తి ఉత్పాదకతలో సింగరేణిని ప్రథమ స్థానంలో నిలిపిన కాంట్రాక్ట్ కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు విమర్శించారు. ఎస్ఎంఎస్ ప్లాంటు వివిధ సివిల్ పని ప్రదేశాలలోని సమావేశం లో పాల్గొని మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న ధరలు, పెరగని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను కేంద్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పట్ల వివక్షత చూపుతుందన్నారు కోల్డ్ బెల్ట్ ఎమ్మెల్యేలకు సంవత్సరానికి రెండు కోట్లు మరియు వారి కుటుంబ సభ్యుల పేరుతో ట్రస్టులకు కోట్ల రూపాయలు సింగరేణి కేటాయిస్తుందన్నారు. లాభాలలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీతం పెంచేందుకు వెనకాడుతుందన్నారు. పేరుగుతున్న ప్రధానమంత్రి ,ముఖ్యమంత్రి ,ఎంపీలు ఎమ్మెల్యేల వేతనాలకు అడ్డు అదుపు లేదన్నారు. సింగరేణిలో అధికారుల వేతనాలు పేరుగుతున్నాయి, పర్మనెంట్ కార్మికుల వేతనాలు జరుగుతున్నాయి, కానీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న క్వాటర్స్ ల ను కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు కాంట్రాక్ట్ కార్మికులు లేకుండా సింగరేణి ఒక్కరోజు కూడా నడవదన్నారు 9 సంవత్సరాల కాలంలో సింగరేణి నుండి కేంద్ర ప్రభుత్వం తన ఖజానాలో సుమారు 24 కోట్లు వేసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 27 కోట్లు దండుకున్నది అన్నారు. కాంట్రాక్ట్ కార్మిక సమస్యలపై జూలై 7న కలెక్టరేట్ల వద్ద ధర్నా జూలై 14 15 తేదీలలో జీఎం కార్యాలయం ముందు దీక్షలు జులై 21 22 తేదీలలో హెడ్ ఆఫీస్ వద్ద 48 గంటల దీక్ష నిర్వహిస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు అందరూ పాల్గొని పోరుబాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాసరావు, సిఐటియు మండల కన్వీనర్ ఉప్పుతల నరసింహారావు, కృష్ణయ్య, రవి, మాధవరావు, లక్ష్మి, అమృత రావు, రాంబాబు, వీరస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి రాష్ట్ర జాతాను జయప్రదం చేయండి

**విశాలభారతి - భద్రాచలం :** సిఐటియు భద్రాచల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పట్టణ కమిటీ సమావేశం లలిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం లో సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మచారి మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణ కోసం అంగన్వాడీ ఉద్యోగులకు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం కనీస వేతనం పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న అంగనవాడి రాష్ట్ర జాత ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ 26వ తేదీ ఉదయం 9 గంటలకు భద్రాచలం అంబేద్కర్ సెంటర్లో భారీ సభ నిర్వహిస్తున్నామని ఈ జాతాలో యూనియన్ రాష్ట్ర నాయకులు జయలక్ష్మి గారు హాజరవుతారని భద్రాచల పట్టణంలో అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు అందరూ హాజరై ఈ జాతను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భద్రాచల పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి శ్రామిక మహిళా పట్టణ కన్వీనర్ మర్లపాటి రేణుక సిఐటియు టౌన్ నాయకులు ఎన్ నాగరాజు అంగన్వాడి టీచర్స్ వర్కర్స్ పాల్గొన్నారు.




# నకిలీ విత్తనాలు ఎరువులు అరికట్టాలి.

**మహబూబాబాద్ - విశాల భారతి :** నకిలీ విత్తనాలు ఎరువులను అరికట్టాలని, నాణ్యత మైన విత్తనాలను ఎరువులను సరఫరా చేయాలని, ఎస్సీ ఎస్టీ బీసీలకు విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని, నకిలీ విత్తనాల ఎరువుల కంపెనీలను గుర్తించి ముందస్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. భారత రైతు కూలీ సంఘం (ఏ.ఐ.కే.ఎం.ఎస్) ఆధ్వర్యంలో మహబూబాబాద్ తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించి అనంతరం తాసిల్దార్ ఇమ్మనియల్ వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమం ఉద్దేశించి ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కే బాబన్న మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ విత్తనాలు ఎరువుల వలన రైతాంగ తీవ్రంగా నష్టపోతున్నారు. కొత్త కొత్త కంపెనీల పేరుతో రైతులను మోసం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల ఎరువుల కంపెనీల పేర్లను ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎస్సీ ఎస్టీ బీసీ రైతులను ఉచితంగా విత్తనాలను అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లాలు, కొలిపాక ఐలయ్య, బద్రు కల్పన, దర్గయ్య బిక్షపతి, యాకయ్య, వాల్యా, జ్యోతి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద మిత్రుని కుటుంబానికి స్థలం విరాళం



**మునగాల - విశాలభారతి :** నిరుపేద మిత్రుని మరణం ఆ స్నేహితులను కలచి వేసింది. మిత్రులందరూ కలసి ఒక స్థలం కొనుగోలు చేసి అతని కుటుంబానికి విరాళంగా ఇచ్చారు. మునగాల మండలం బరాకత్ గూడెం గ్రామానికి చెందిన లంజపల్లి మంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. మంగయ్య కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకునేందుకు అతని 10వ తరగతి మిత్రులందరూ కలసి అదే గ్రామంలో ఇంటి స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ బాండ్ ను మంగయ్య భార్య రేణుక కు శనివారం సాయత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ మంగయ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1997 సంవత్సరం మునగాల హైస్కూల్ లో 10వ తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిబందనలకు విరుద్దంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**మహబూబాబాద్ - విశాలభారతి :** ప్రభుత్వ నిబందనలకు విరుద్దంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న నాగార్జున స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవెందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు, డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆద్వర్యంలో పుస్తకాలు అమ్ముతున్న గది ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగార్జున స్కూల్ యాజమాన్యం తమకు ఇష్టం వచ్చిన ధరలకు పేద విద్యార్థులకు అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మడమే కాకుండా, ఇతరులకు ఫోన్ చేసి ఇక్కడ విద్యార్థి సంఘాలు వచ్చారు, అంతు, వాళ్ళ అంతు చూడాలని చెప్పి బెదిరించడం జరిగింది. తక్షణమే ఆ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జ్యోతి బసు, పిడిఎస్యు నాయకులు గుగులోతు కళ్యాణ్, మురళి,వీరెందర్,వాసు,జశ్వంత్

# దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో దొమతేరల పంపిణీ

**మణుగూరు - విశాలభారతి :** దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో దోమతెరలు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ గంట రాధా తెలిపారు. శనివారంలో బుగ్గ గ్రామపంచాయతీ లోని వలస ఆదివాసి గ్రామమైన బడుగులలో ప్రతి ఇంటికి దోమతెరలు, బట్టలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 40 కుటుంబాలలో 120 మందికి దొమతేరలుపంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో రాధా మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసర ప్రాంతాలలో నిలువ నీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు





# మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక..

**మేడిపల్లి - విశాలభారతి :** మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని ఎం కన్వెన్షన్ హాల్ లో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా కల్కూరి ఎల్లయ్య,ప్రదాన కార్యదర్శిగా చిర్ర శ్రీదర్ రెడ్డి,కోశాదికారిగా ననుబోతు రాము యాదవ్ లతో పాటు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు తమను ఎన్నుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



# పూర్తయిన కల్వర్టు నిర్మాణం

**శాయంపేట - విశాలభారతి :** మండలంలోని పత్తిపాక గ్రామంలో ఇటీవలే బిటి రోడ్డుతో పాటు కల్వర్టు నిర్మాణం పనులు ప్రారంభించిన సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి. బిటి రోడ్డుకు కంకర పోసి మర మత్తులు చేస్తున్నారు. ఈ దశలో రోడ్డు మధ్యలో వున్న కల్వర్టు నిర్మాణం వేగవంతం చేసి పూర్తి చేసారు.అనంతరం మళ్ళీ వెంటనే రోడ్డు పనులు వేగవంతం చేస్తామని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని,గ్రామ అభివృద్ధి కి గండ్ర దంపతులు సహకారమేనని అన్నారు.వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు గ్రామం తరుపున,వారి తరుపున తెలియజేసారు.ముందు ముందు మరింత మా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. గ్రామ అభివృద్ధి కి సహకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసారు.

# ముదిరాజులను అవమానపరిచిన కౌశిక్ రెడ్డి

- ఎమ్మెల్సీ పదవి నుండి వెంటనే బర్తరఫ్ చేయాలి
- పాలకుర్తిలో నల్ల బ్యాడ్జీలతో ముదిరాజుల నిరసన



**పాలకుర్తి - విశాలభారతి :** ముదిరాజులను అవమానపరిచిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ముదిరాజ్ సంఘం భవనం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.కులం పేరుతో దూషించడం అవమానపరచడం సరికాదని, పరస్పర గౌరవించుకోవడం అవసరమని వారు అన్నారు. కులాల మధ్య అసమానతలు సృష్టించడం సరికాదని, ముదిరాజులు అన్ని రంగాల్లో ముందుండాలని, సామాజిక రాజకీయ రంగాల్లో తమ చైతన్యాన్ని చాటి చెప్పాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు దాసరి మధు,డైరెక్టర్లు మామిండ్ల రమేష్ రాజా జీడి మనోహార్ దుంపల సంపత్ సొసైటీ సభ్యులు రేగుల కృష్ణ, జీడి నిరంజన్, ఎలబోయిన సోమేష్, మామిండ్ల సంపత్, శెవ్వ నాగరాజు, జీడి బాలరాజు,,శేరు అశోక్, మామిండ్ల భాస్కర్, సాగర్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి..



**శాయంపేట - విశాలభారతి :** తప్పులను సమాజానికి తెలియపరచే జర్నలిజం వృత్తిలో ఉండి ఓ ప్రైవేట్ ఛానెల్ లో పని చేస్తున్న ముదిరాజ్ ను అక్రమంగా బందించి,పరుష పదజాలంతో అతన్నే కాకుండా మొత్తం ముదిరాజ్ జాతి నీ తిట్టడం,ముదిరాజ్ లందరిని అవమాన పరిచినట్లే అని, ఎమ్మెల్సీ పదవిలో ఉన్న వారు, ఇతరులు ఏదైనా తప్పు చేస్తే లీగల్ గా చూసుకోవాలి కానీ,జాతిని తీట్టి, అవమానపరిచే మాటలు అనకూడదు అని,రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజ్ లను తిడితే యావత్ జాతి చేతులు చేతులు ముడుచుకొని కూర్చోదు అని,తగిన బుద్ధి చెపుతుంది అని,ఇప్పటికైనా ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ముదిరాజ్ జాతికి క్షమాణపలు చెప్పాలని (మెపా)ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ యూనియన్ ముదిరాజ్ కుల సభ్యులు తాళ్ళ రవి ముదిరాజ్ అన్నారు.



విశ్వ కళ్యాణం లోక సంక్షేమం కోసం మాజీ హోమ్ మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ మరియు కుటుంబ సభ్యులచే నిర్వహించే "చతురాయతన శత చండీ సహిత శ్రీ రాజశ్యామలా మహా యాగానికి హాజరై యాగ ఫలాలు మరియు తీర్థ ప్రసాదాలు తీసుకున్న బీజేపీ శాసన సభ సభ్యులు శ్రీ ఈటెల రాజేందర్.




# దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి
- రుద్రారంలో పోచమ్మ తల్లి దేవాలయం జీర్ణోదరణ పనులకు పూజలు

**పటాన్ చెరు- విశాలభారతి :** ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా అన్ని మతాల ప్రార్థన స్థలాలను అభివృద్ధి చేస్తున్నట్టు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామ పరిధి లోని మల్లికార్జున నగర్ లో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం జీర్నోద్ధారణ పనులకు శనివారం స్థానిక సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఎంపీటీసీ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు పాండులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మధుసూదన్ రెడ్డికు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్యాత్మికతకు అద్దం పట్టేలా నియోజకవర్గంలో ఆలయాలను అభివృద్ధి చేశారని చెప్పారు. ఇప్పటివరకు 170 కి పైగా దేవాలయాలు నిర్మించి దైవభక్తి చాటుకున్నారని తెలిపారు. కోట్లాది రూపాయలు వెచ్చించి అత్యాద్భుతంగా ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. రుద్రారంలోని పురాతన దేవాలయాలతో పాటు నూతన దేవాలయాల నిర్మాణాలకు ఎల్లప్పుడూ ఉండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు నర్సింహా, నాయకులు శివ యోగెందర్ గౌడ్, నాగరాజు, అరుణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.






# మూడో సారి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలి..

- కేసీఆర్ సార్ మరోసారి ముఖ్యమంత్రి కావాలి
- భద్రాద్రి శ్రీరాముడిని ప్రార్థించిన నీలం మధు

**పటాన్ చెరు-విశాలభారతి** బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని, సీఎం కేసీఆర్ సార్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని శ్రీరాముడిని ప్రార్థించినట్లు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయురారోగ్యాలతో, చల్లగా ఉండాలని స్వామి వారిని కోరినట్లు చెప్పారు. ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు ఆయన అన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సేవ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, మంత్రులు కేటిఆర్, హరీశ్ రావుల మార్గదర్శనంలో పటాన్ చెరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందని నీలం మధు ముదిరాజ్ తెలిపారు.

## గ్రూప్4 పరీక్ష హాల్‌టిక్కెట్లు విడుదల

### - టీఎస్‌పీఎస్‌సీ వెబ్‌సైట్‌లో అందుబాటు

**విశాలభారతి స్టేట్ బ్యూరో:** జూలై 1వ తేదీన జరగబోయే గ్రూప్4 పరీక్ష హాల్‌టిక్కెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం విడుదల చేసింది. టీఎస్‌పీఎస్‌సీ వెబ్‌సైట్ నుండి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. జూలై 1న ఉదయం 10 నుంచి 12.30 వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు పేపర్ 2 పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. మొత్తం 8వేలకు పైగా ఉద్యోగాలకు గతేడాది నోటిఫికేషన్ జారీ చేయగా.. రాష్ట్రవ్యాప్తంగా 9.5లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తులు చేసుకున్నారు.

## ప్రాణంతీసిన పగ.. మాట్లాడుదామని పిలిచి కత్తితో నరికేశాడు

ఏపీలోని విజయవాడ శివారులో ఇవ్వాల (శనివారం) సాయంత్రం నడిరోడ్డుపై ఓ మహిళ దారుణ హత్యకు గురయ్యింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జక్కంపూడికి చెందిన నాగమణి రెండో కూతురుతో అల్లుడికి విబేధాలు వచ్చాయి. ఇందుకు సంబంధించి కోర్టులో కేసు పెండింగులో ఉంది. ఈ నేపథ్యంలో అత్తమామలపై కక్ష పెంచుకున్న అల్లుడు రాజేశ్ పథకం ప్రకారం వారితో మాట్లాడాలని ఫ్లైఓవర్ ప్రాంతానికి పిలిచాడు. వారు అక్కడకు రాగానే బైక్ పై ఉన్న మామను నరికేందుకు ప్రయత్నించగా ఆయన పారిపోయాడు. అనంతరం రాజేశ్ అత్తపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన నాగమణి మృతి చెందింది. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.



# సాయి నగర్ కాలనీలో గడప గడపకు బీజేపి

**పటాన్ చెరు-విశాలభారతి** బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అధ్వర్యంలో అధ్వర్యంలో శనివారం రామచంద్రపురం పట్టణ పరిధి లోని సాయి నగర్ కాలనీలో గడపగడపకు బిజెపి కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని 281, 282 బూతులలో ఇంటి ఇంటికి తిరుగుతూ కరపత్రాలను అందిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం ప్రధాన కార్యదర్శి బలరాం, బీజేవైఎం అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్, భూపాల్ రెడ్డి, రాంబాబు, నారాయణ, రాజు, పెంట రెడ్డి, కృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# సీఎం కేసీఆర్ పాలనలో మున్సిపాలిటీలకు మహర్దశ

- అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి
- సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు-విశాల భారతి** ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో మునిసిపాలిటీలకు మహర్దశ వచ్చిందని అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపాలిటీల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తున్నదని చెప్పారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు మంజీరా నగర్ లో, 12వ వార్డు బాలాజీ నగర్ కాలనీలో 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో నిరంతరాయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నమని తెలిపారు. ప్రతి కాలనీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఇటీవల పటాన్ చెరు బహిరంగ సభలో మున్సిపల్ అభివృద్ధికి సీఎం కేసీఆర్ 30 కోట్ల రూపాయల నిధులు కేటాయించారని, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సూచనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్లు సభ్యులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ముగ్గురు మంత్రులు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్-విశాల భారతి:** బీఆర్ ఎస్‌కు సంబంధించిన ముగ్గురు మంత్రులు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కొందరు కాంగ్రెస్ నాయకులు పార్టీ వీడతారని గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. అయితే అందుకు సంబంధించి రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మాణిక్‌రావు ఠాక్రే ఆరా తీస్తున్నట్లు వివరించారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అరోగ్యం గురించి మాణిక్‌రావు ఠాక్రే ఆరా తీశారని తెలిపారు. అదేవిధంగా గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మానిక్ రావ్ ఠాక్రే నేడు కలసి తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో వస్తున్న మార్పులు, కాంగ్రెస్ పార్టీలో చేరికలకు ఇతర పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లోకి చేరేందుకు మక్కువ చూపుతున్న విషయాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. మరొకవైపు సోమవారం రాహుల్ గాంధీని కలిసేందుకు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతోపాటు పలువురు నాయకులు ఢిల్లీ వెళ్లనున్నారు. ఇదే సమయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన ముఖ్యనాయకులను ఢిల్లీకి రావాలని పిలిచినట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. వారు పార్టీలో చేరడం వల్ల ముందు నుంచి పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా కాంగ్రెస్ అధిష్ఠానం ముందు జాగ్రత్తలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పీసీసీతోపాటు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి, ఏఐసీసీ నాయకులు ప్రత్యేకంగా సమావేశమై.. ఆ రెండు జిల్లాల్లో పార్టీ పరిణామాలపై చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి.




# కవితను కలిసిన ఎల్బీనగర్ బీఆర్ఎస్ లీడర్లు.

**హైదరాబాద్,విశాల భారతి:** ఎల్బీనగర్ చెందిన బీఆర్ఎస్ లీడర్లు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో శనివారం కలిశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పార్టీ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సామ రమణా రెడ్డి,జిన్నారం విఠల్ రెడ్డి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ కవితను కలిశారు.ఈ సందర్భంగా కవిత రాష్ట్ర రాజకీయాల గురుంచి చర్చించారు. వచ్చే ఎన్నికలలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జాగృతి కార్యకర్తలు సమిష్టిగా కలిసి పనిచేయాలని కోరారు.ఇటీవల ఎల్బీనగర్ లో జరిగిన పలు సంఘటనలపై ముద్దగౌని రామ్మోహన్ గౌడ్,మాజీ కార్పొరేటర్లు సామ రమణా రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి తో మాట్లాడి తెలుసుకొన్నారు. ఎల్బీనగర్ లో జరుగుతున్న రాజకీయ పరిమాణాలను ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు దృష్టికి తీసుకెళ్తానని కవిత చెప్పినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంలో చంపాపేట డివిజన్ పార్టీ నాయకులు మెట్టు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ ఎమ్మెల్యేకు తప్పిన పెను ప్రమాదం

- ఆవు అడ్డం రావడంతో యాక్సిడెంట్
- ఎమ్మెల్యే చేతికి గాయాలు
- చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు

**స్టేట్ బ్యూరో హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుకు పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆయన వాహనం.. నేరడిగొండ మండలం కొరిటికల్ జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైంది. ఎదురుగా పశువు రావడంతో ప్రమాదం చోటుచేసుకోగా.. ఘటనలో ఎమ్మెల్యే చేతికి గాయాలయ్యాయి. వెంటనే ఆయనను బోథ్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అనంతరం ఎమ్మెల్యే ఆదిలాబాద్‌లోని తన స్వగృహానికి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే ప్రాణాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలిసిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆసుపత్రికి భారీగా తరలివచ్చారు. అందరి ఆశీస్సుల వల్ల ప్రాణాలతో బయటపడ్డానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 'ఈ నెల 22న తెలంగాణ అమరవీరుల స్మారకం ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్ వెళ్లాను. ఈరోజు తిరిగి వస్తుండగా.. అనుకోకుండా రోడ్డుప్రమాదం జరిగింది. దేవుడి దయ, ప్రజల ఆశీస్సుల వల్ల ఎలాంటి అపాయం జరగలేదు. నన్ను పరామర్శించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. ఇది దేవుడు నాకు ఇచ్చిన రెండో జన్మగా భావిస్తా' అని రాథోడ్ బాపూరావు అన్నారు. కాగా, ఉదయం ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి కాన్వాయ్‌లోని ఓ కారు సైతం ప్రమాదానికి గురైంది. కర్ణాటక రాష్ట్రంలోని శృంగేరి పీఠానికి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోహిత్ రెడ్డి కారు చెట్టును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే కారులో లేకపోవడంతో ప్రమాదం తప్పింది.





## అందరికీ సమాన హక్కులు.

**ముషీరాబాద్ - విశాలభారతి :** భారత రాజ్యాంగం ప్రజలందరికీ సమాన హక్కులు అవకాశాలు కల్పించిందని మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ చంద్రయ్య అన్నారు. ఇప్పటికే షెడ్యూల్ కులాలు తెగలు వెనుకబడిన తరగతుల ప్రజల వివక్షత హక్కుల ఉల్లంఘన జరుగుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బంధు సొసైటీ ఆధ్వర్యంలో శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన ఆత్మీయ సభ అధ్యక్షులు పల్లెల వీరస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం పల్లెల వీరస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు షెడ్యూల్ కులాలు తెగలు వెనుకబడిన కులాలకు ఇచ్చిన భూములను అభివృద్ధి పేరుతో నేటి ప్రభుత్వం గుంజుకుంటుందని విమర్శించారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇవ్వకపోగా ఉన్న కొద్దిపాటి భూమిని గుంజుకుంటూ జీవించే హక్కు లేకుండా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐ ఆర్ టి భరత్ భూషణ్, ఆరేపల్లి రాజేంద్ర, నాతానియేల్, డాక్టర్ రాజమౌళి, శ్యామ్ లాల్,వనపాక నరసింహ, గొల్లపల్లి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన గెలుపు.. జనం గెలుపు

- వైసీపీని తరిమి కొడదాం
- 34 సెగ్మెంట్లపై స్పెషల్ ఫోకస్
- కులాలు, మతాలకు అతీతంగా రాజకీయం
- జనసేనాని పవన్ కల్యాణ్

**ఆంధ్రప్రదేశ్ - విశాలభారతి :** వైసీపీ పాలన నుంచి అన్నపూర్ణలాంటి ఉభయ గోదావరి జిల్లాలను విముక్తి చేయగలిగితే రాష్ట్రం బాగుపడుతుందని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. గోదావరి జిల్లాల ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్రాభివృద్ధికి సూచికగా మారుతుందని చెప్పారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజోలులో మార్పు కోసం చిరు దీపం వెలిగించారు. అది భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా అఖండ జ్యోతిగా మారి ప్రజలందరికీ వెలుగునిస్తుందన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని 34 నియోజకవర్గాలపై జనసేన ప్రత్యేక దృష్టి సారించిందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పి. గన్నవరం నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరడం ఖాయమన్నారు. శనివారం దిండిలో పీ గన్నవరం నియోజకవర్గ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, వార్డు సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా సామాన్యుడికి అండగా ఉండాలని 2008లో కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ స్థాపించాను. బడుగు, బలహీన వర్గాలు, అధికారం చూడని వర్గాలకు అధికారం అందాలనే ఆశయంలో 2009లో పొలిటికల్ ప్రాసెస్ లోకి వచ్చాం. రాజకీయ పార్టీకి అన్ని వర్గాల నుంచి మద్దతు లభించింది. అయితే కొంతమంది కోవర్టుల వల్ల పార్టీని విలీనం చేయాల్సి వచ్చింది. రాజోలు జనసేన నాయకులు, కార్యకర్తల్లా ఆనాడు నాయకులు బలంగా నిలబడి ఉంటే పార్టీని విలీనం చేయాల్సిన అవసరం వచ్చేదే కాదు. 2014లో జనసేన పార్టీ స్థాపించినప్పుడు నేను ఒకటే చెప్పాను. ఇల్లేమో దూరం, అసలే చీకటి గాఢాంధకారం, దారంతా గతుకులు, చేతిలో దీపం లేదు కాని గుండెల నిండా ధైర్యం ఉంది అనే కవి మాటలు చెప్పాను. 2019 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీని రాజోలు నియోజకవర్గంలో గెలిపించి మార్పు కోసం చిరు దీపం వెలిగించారు. మీరు వెలిగించిన ఆ దీపమే భవిష్యత్తులో అఖండ జ్యోతిగా ప్రజలందరికీ వెలుగులు పంచుతుంది.



**అంబేద్కరిజం అంటే ఏమిటి**

జనసేన పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే స్వార్ధ ప్రయోజనాల కోసం పార్టీ వదిలిపెట్టి వెళ్లిపోయారు. ఆయన చిన్నపిల్లాడు కాదు రిసార్టులు, హోటల్స్ లో పెట్టి బుజ్జగించడానికి. బాగా చదువుకున్న వ్యక్తి. నిజమైన అంబేద్కరిజం అంటే ఎన్ని కష్టాలు ఎదురైనా నమ్ముకున్న ప్రజలకు అండగా నిలబడటం. అంతే తప్ప ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి జంప్ అవ్వడం కాదు. ఎమ్మెల్యే పక్క పార్టీకి వెళ్లిపోయినా ఈ ప్రాంత వాసులు ఇంతటి ఘన స్వాగతం పలికారు. ఓడిపోయిన తరువాత కూడా ప్రజలు భుజం తట్టి అండగా నిలబడటం ఒక్క జనసేన పార్టీ విషయంలోనే జరిగింది. నిజంగా ఈ రోజు పార్టీలోనే ఉండి ఉంటే భుజాలపై పెట్టుకొని చూసుకునేవాళ్లం. ఎమ్మెల్యే వెళ్లిపోయినా పార్టీకి అండగా ప్రజలు నిలబడ్డారు. ఆ ప్రేరణతోనే ముందుకు వెళ్తున్నాం. కష్టాలను తట్టుకొని నాయకులు నిలబడితే కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు అండగా నిలబడతారని వారాహి యాత్ర నిరూపిస్తోంది.

### అంతర్గత పోరుపై బీజేపీ అధిష్ఠానం దృష్టి..

# పరిష్కారం దిశగా నేతలతో చర్చలు



ఆసలే కర్ణాటక ఓటమి పరాభవం వెంటాడుతున్న వేళ, పక్కనే ఉన్న తెలంగాణలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి కమలనాథులకు తలనొప్పిగా మారింది. క్రమ శిక్షణకు మారుపేరుగా చెప్పుకునే కాషాయదళంలో వర్గ పోరు, అంతర్గత విభేదాలు ఆ పార్టీని మూడోస్థానానికి నెట్టేశాయి. ఒకదశలో రాష్ట్రంలో అధికార భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కు ప్రధాన ప్రత్యర్థిగా ఎదిగి సవాల్ విసిరిన బీజేపీ, ఇప్పుడు ప్రత్యర్థులతో పోరు సంగతి పక్కనపెడితే, అంతర్గత పోరును పరిష్కరించడమే పెద్ద సవాలుగా మారింది.కాంగ్రెస్‌లో ఈ తరహా పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి. కానీ తెలంగాణలో నేతల మధ్య పెద్ద పెద్ద అగాధాలే ఉన్నా సరే.. ఎన్నికల వేళ అన్నింటినీ పక్కనపెట్టి కర్ణాటక స్ఫూర్తితో కలసి కట్టుగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి శత్రువులు ఎక్కడో ఉండరు, పార్టీలోనే ఉండి కీచులాటలు, కుమ్ములాటలతో నష్టం చేస్తారన్న నానుడి ఉంటుంది. అయితే ఎన్ని విభేదాలున్నా.. ముందు పార్టీని గెలిపించాలి, ఆ తర్వాతే ఏదైనా అన్న చందంగా ఈ మధ్య నేతలు రాజకీయ పరిణితిని ప్రదర్శిస్తున్నారు. ఆ మేరకు సత్ఫలితాలు కూడా పొందుతున్నారు.

ఇదిలా ఉంటే తెలంగాణ బీజేపీలో బండి సంజయ్‌కు రాష్ట్ర పగ్గాలు అప్పగించినప్పటి నుంచి పార్టీలో వర్గ పోరు మొదలైంది. మొదట్లో సీనియర్ నేతలు బండి సంజయ్ నాయకత్వాన్ని అంగీకరించలేకపోయారు. బండి సంజయ్ రాజకీయ నేపథ్యం చూస్తే అప్పటి వరకు ఆయన కరీంనగర్‌లో కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పనిచేసిన వ్యక్తి. 2018లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. ఆ వెంటనే 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆయనకు జిల్లా స్థాయి మించి గతంలో రాష్ట్ర స్థాయిలో పనిచేసిన అనుభవం కూడా పెద్దగా లేదు. అయితే బండి సంజయ్‌కు ఉన్న పోరాట పటిమను గమనించిన జాతీయ నాయకత్వం ఏకంగా రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల్ని అప్పగించింది. ఇది రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో పనిచేసిన నేతలకు రుచించలేదు.మరోవైపు బండి సంజయ్ నేతృత్వం వహించిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో కారణాలేవైనా సరే బీజేపీ అనూహ్య విజయాలు సొంతం చేసుకోవడం ఆయనకు క్రేజ్ తీసుకొచ్చింది. గతంలో హైదరాబాద్ నగరంతో పాటు అక్కడక్కడా మాత్రమే ఉనికి కల్గిన బీజేపీ ఉత్తర తెలంగాణలో గ్రామస్థాయికి విస్తరించింది. ఒక దశలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కు అసలైన ప్రత్యర్థి బీజేపీయే అన్న దశకు చేరుకుంది. కానీ మొదటి నుంచి బండి సంజయ్‌ను జిల్లాస్థాయి నేతగానే చూస్తూ వచ్చిన సీనియర్లు ఆయనకు అనేక రకాలుగా అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేశారు. బండి సంజయ్‌ను అభిమానించే వర్గం ఒకవైపు, పార్టీలో సీనియర్లు మరోవైపు అన్న చందంగా పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే.. పార్టీలోకి కొత్తగా చేరినవారితో బండి సంజయ్‌కు పొసగని వాతావరణం నెలకొంది. కొత్తగా పార్టీలోకి చేరిన డీకే అరుణ, ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహా పలువురు నేతలు తమను బండి సంజయ్ పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. పార్టీలో కొత్తగా చేరినవారికి మర్యాద, గౌరవం, తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపణలు చేశారు. పార్టీ ఎదుగుదల కోసం తమ వ్యూహాలు, కార్యాచరణను అధిష్ఠానం పెద్దలు ముందు ఉంచినా సరే తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారంతా సంజయ్‌కు వ్యతిరేకంగా జట్టుకట్టారు. పార్టీలో సీనియర్లు కూడా ఈ వర్గానికి పరోక్ష మద్దతునిస్తూ సమస్యను మరింత జఠిలం చేశారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ అధిష్ఠానం తెలంగాణ పార్టీలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ వచ్చింది. బండి సంజయ్‌ను ఢిల్లీకి పిలిపించి ఆయన దగ్గర నుంచి కొంత సమాచారాన్ని తీసుకుంది. ఇప్పుడు ఆయన్ను వ్యతిరేకిస్తున్న వర్గం నేతలకు పిలుపు అందించింది. వారిచ్చే సమాచారాన్ని కూడా తెలుసుకున్న తర్వాత.. సమస్యకు పరిష్కారం ఎలా అందించాలో ఆలోచించే అవకాశం ఉంది. ఎన్నికల వేళ అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి..గెలుపే లక్ష్యంగా కలసికట్టుగా పనిచేసేలా చేయడమే అధిష్ఠానం ముందున్న సవాల్. ఈ క్రమంలో అధిష్ఠానం పెద్దలు మొదలుపెట్టిన కసరత్తు ఎంత మేర ఫలిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.



# సంగప్ప నేతృత్వంలో బిజెపిలో భారీ చేరికలు

- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుంది..
- అవినీతి,భూ కబ్జాలు,అరాచకాలకు కేరాఫ్ బీఆర్ఎస్...
- వచ్చే ఎన్నికల్లో ఖేడ్ లో రికార్డు సృష్టించబోతున్నాం.
- రాష్ట్ర అధికార ప్రతినిధి జానవాడే సంగప్ప....

**నారాయణఖేడ్ -విశాల భారతి:** కేంద్ర ప్రభుత్వం నిధులతోనే రాష్ట్రంలో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర బీజేపీ పార్టీ అధికార ప్రతినిధి జానవాడే సంగప్ప పేర్కొన్నారు. శనివారం నేల్లీమేట్ గ్రామంలో బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల నుండి బీజేపీ పార్టీలోకి దాదాపుగా 55 మందికి పైగా యువకులు చేరారు. వారికీ పార్టీ కండువా కప్పి సంగప్ప బిజెపిలోకి ఆహ్వానించారు. అనంతరం సంగప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి భూకబ్జాలు అరాచకాలకు కేరాఫ్ గా బిఆర్ఎస్ మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి వేగంగా జరుగుతుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని దీవించాలని కోరారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని, నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమం లో బిజెపి సీనియర్ నాయకులు సాయిరాం, సంజు పాటిల్, పట్నం మాణిక్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# మణిపూర్ అల్లర్లపై కేంద్ర హోంశాఖ అఖిలపక్ష సమావేశం.. బీఆర్ఎస్ తరపున పాల్గొన్న వినోద్ కుమార్



స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడుస్తున్నా ఇంకా కులాలు, మతాలు, జాతుల మధ్య ఘర్షణలు జరగడం దురదృష్టకరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మణిపూర్ అల్లర్లపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన హాజరయ్యారు. సమావేశం అనంతరం వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ కాలంలో తాము ఢిల్లీలో ఉన్నప్పుడు ఈశాన్య రాష్ట్రాల రాజకీయ పార్టీలు, సంఘాలు మమ్మల్ని కలిసేవారని, ఈ అంశంపై తమకు కొంత అవగాహన ఉందని చెప్పారు. మణిపూర్ ప్రజలకు అన్ని రాజకీయ పార్టీలు భరోసా, ధైర్యం కల్పించే బాధ్యత ఉందని అఖిలపక్ష సమావేశంలో చెప్పామని ఆయన వెల్లడించారు. కారణాలు తెలియనప్పటికీ 1990 నుంచి అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొందని, కుకిలు, నాగలూ ఉన్న చోట తమను ఎస్టీల్లో చేర్చాలని మెయితెయిలు డిమాండ్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఎవరినైనా ఎస్టీల్లో చేర్చాలంటే ఆ హక్కు పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుందన్నారు. కానీ మణిపూర్ హైకోర్టు 4 వారాల్లో మెయితెయిలను ఎస్టీల్లో చేర్చాలని తీర్పు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకోలేదన్న ఆయన, ఒకవేళ స్టే ఇచ్చి ఉంటే ఇలాంటి సంఘటనలు జరగపోయి ఉండేదని సమాచారం ఉందని వినోద్ కుమార్ తెలిపారు.ఘర్షణల కారణంగా నిర్వాతులైన వేలాది మందికి కేంద్రం వెంటనే పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. 50 రోజులు ఇంటర్నెట్ నిషేధించడం మంచిది కాదని తాము కేంద్ర ప్రభుత్వానికి చెప్పామని ఆయన వెల్లడించారు. ఇంటర్నెట్ సేవలను పునరుద్ధించాలని కోరామన్నారు. ఇంత జరిగినా ఇప్పటివరకు ప్రధాని స్పందించకపోవడం మంచి పద్ధతి కాదని ఆయన విమర్శించారు. 13 ఏళ్ల క్రితం కాశ్మీర్‌లో ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆనాడు హోంశాఖ మంత్రి చిదంబరం నేతృత్వంలో అఖిలపక్ష భేటీ జరిగిందని గుర్తు చేశారు. క్షేత్ర స్థాయిలో పర్యటించేందుకు అన్ని పార్టీలను తీసుకెళ్లారని ఆయన చెప్పారు. నేటి సమావేశంలో తాము చేసిన సూచనలు, సలహాలను స్వీకరిస్తామని చెప్పారని వినోద్ కుమార్ అన్నారు.

## పట్టణాల్లో పెరుగుతున్న సంక్షేమం.. సాకారం అవుతున్న సొంతింటి కల

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో వైసీపీ సర్కార్ చేపట్టిన కొత్త పథకాలతో సం'క్షేమం' పెరిగింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామీణ ప్రాంతాలతో సమానంగా పట్టణ ప్రాంతాల ప్రగతిపై దృష్టిసారించింది. ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ ప్రాంతాలు వేగంగా విస్తరిస్తున్నాయి. పిల్లల చదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పల్లె నుంచి పట్టణాలకు వలస వచ్చే వారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. 2011 నుంచీ పట్టణ ప్రాంతాల్లో జనసంఖ్య శరవేగంతో పెరుగుతోంది. గతంలో 18 శాతం ఉన్న పట్టణ ప్రాంతాల జనాభా 2021 నాటికి 37 శాతానికి పెరిగిందని అంచనా. నగరాలు, పట్టణాలుగా అంటే మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ హోదా రాని పెద్ద గ్రామాలు పట్టణ ప్రాంతాల సౌకర్యాలతో నవ్యాంధ్రలో వృద్ధిచెందుతున్నాయి.పట్టణ హోదా ఇంకా దక్కని ఇలాంటి పెద్ద గ్రామాలను 'సెన్సస్ టౌన్లు' గా పిలుస్తారు. వెనుకబడిన ప్రాంతాలుగా ముద్రపడ్డ చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పట్టణ జనాభా బాగా అభివృద్ధి చెందిన జిల్లాలతో సమానంగా పెరుగుతోందని 2011 జనాభా లెక్కలు తేల్చిచెప్పాయి. పట్టణ, నగర ప్రాంతాల్లో చాలీచాలని జీతాలతో ఇంటి అద్దెలు, రవాణా ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు వంటివి పేద, మధ్య తరగతి వర్గాలకు భారంలా పరిణమించే పరిస్థితి. ఈక్రమంలో వైసీ పీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆయా వర్గాలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తున్నాయి.

### శ్రామికవర్గ యోధుడు

# కామ్రేడ్ డి.వి.కృష్ణ


కార్మికవర్గ పుత్రుడు, నిత్య అధ్యయన శీలి, ఆదర్శమూర్తి కా॥ డి.వి. కృష్ణ జూన్ 26, 2022న మరణించారు. మరణం సహజమే, కాని దాని సవ్వడికి జడిసి పోతాము. అన్న మాత్రం మరణం ముందొచ్చి నిలబడినా, ఆవహిస్తానని చెబుతున్నా, మరణాన్నే గేలి చేసిన సాహసి డి.వి.కె. అన్న. మరణం వరిస్తుందని ముందస్తుగా తెలిస్తే, దాన్ని తట్టుకోవడం, అనుభవించడం చాలా కష్టం. అందునా 3 లేదా 6 నెలల వ్యవధిని కూడా ముందే చెప్పడం. అయినా డి.వి.కె. కనీసంగా సడలలేదు. పైపెచ్చు "సగటు ఆయుర్దాయువు కంటే ఎక్కువ కాలమే బ్రతికాను, ఇది బోనస్" అని చెప్పడం, మరణాన్ని కూడా దుఃఖంతో కాకుండా, ఆనందంగా ఆహ్వానించడమే అవుతుంది. డి.వి.కృష్ణ 1970లో పూర్తికాలం కార్యకర్తగా ప్రవేశించిన నాటి నుండి వెనుదిరగలేదు. ప్రారంభం నుండె కార్మిక వర్గ దృక్పథాన్ని అలవరుచుకున్నారు. 1975లో గోదావరి లోయ ప్రతిఘటనా ప్రాంతానికి వెళ్ళిన నాటి నుండి ప్రశ్నలు ప్రారంభమయ్యాయి, ఆనాటి నుండి నేటి వరకు అన్న పార్టీలో పరిశోధనా వ్యక్తిగా మారారు. ఆనాటికే ఏర్పరుచుకున్న సిద్ధాంతంతో పనిచేస్తూ పోవడం కాకుండా, క్రియాశీలకంగా, సృజనాత్మకంగా ఆలోచించేవారు. తాను చేస్తున్న పనిలో శాస్త్రీయతను వెలికి తీసేవారు. రివ్యూలను, చేసేవారు. అందులో భాగంగానే ఉద్యమం, పార్టీ లేకుండా కొంత మంది వ్యక్తులతో సాయుధ దళాల నిర్మాణాన్ని ప్రశ్నించాడు. ఆనాటి నుండి నేటి వరకు వ్యవస్థలో జరిగిన మార్పులనూ, జరుగుతున్న మార్పులనూ పసిగట్టి, లోతుగా అధ్యయనం చేసి పార్టీ ముందు పెట్టారు. పార్టీని కార్మికవర్గ పార్టీగా మలచడానికి 1975 నుండి నేటి వరకు పోరాటం సలిపారు. మొత్తం పార్టీలో, రవన్నను, వి.వి. అన్నను కలుపుకుని సమాజ స్వభావాలపై పార్టీలో అనేక మహాసభల్లో తనే డాక్యుమెంట్లను రూపొందించి చర్చను కొనసాగించారు. రాష్ట్ర బాధ్యతల నుండి తొలగించినా కొత్తగా భూమికను ఏర్పాటు చేసుకుని ఉద్యమాన్ని నిర్మించిన కృషీవలుడు. తగిన భౌతిక పరిస్థితుల్లో, రెండింతల కృషి ద్వారా ప్రజా సంఘాలనూ, పార్టీనీ నిర్మించడం సాధ్యమని నిరూపించిన కష్టజీవి, రాష్ట్రంలో మైనారిటీలో ఉండే తన భావాలను మెజారిటీగా మలిచిన విప్లవకారుడు. ఓపికతో దశాబ్దాల పాటు ఐక్యంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి, కేంద్ర కమిటీ నుండి అనేకం ఎదురయినా, సహనంతో, క్రమశిక్షణతో నడిపించిన వారు డి. వి. కృష్ణన్న పార్టీలో సిద్ధాంత రీత్యా మౌలిక విషయాలపై విభేదాలేర్పడినా, మహాసభల ద్వారా పరిష్కరించుకుందామనే భావనలో ఆయన ఉండేవారు. అయితే అనేక జిల్లాల్లో ఏర్పడుతున్న నిర్మాణ సంక్షోభాల రీత్యానూ, దానికి వంత పాడుతున్న కేంద్ర కమిటీ వైఖరి కారణంగా, అనివార్యంగా 'ప్రజాపంథా ఆవిర్భావానికి పూనుకోవలసి వచ్చింది. అన్న పేర్కొనే సమాజ స్వభావాలపై అన్నను అనేక రకాలుగా వ్యాఖ్యానించినా, సదలకుండా, అధైర్యపడకుండా కంకణబద్ధుడై నడిచేవారు. ఒక్క పార్టీ విషయాలూ, సిద్ధాంత విషయాలే కాకుండా, సమాజంలోని సకల విషయాలను సంగ్రహించేవారు. సినిమాలూ, ఆటలూ, కథలూ, నవలలూ, టీవీ వార్తలూ, పాటల పోటీలు లాంటి వాటినన్నింటినీ చూడటం, చదవటం, రాయడం చేసేవారు, వాటి పట్ల ఆసక్తి కనపరిచేవారు. వాటిల్లో కూడా అన్నను ఏదడిగినా చెప్పేంత ప్రవేశం ఉండేది. ప్రతి విషయాన్నీ తెలుసుకోవడం, పూర్తిగా అవగాహన చేసుకోవడంగా ఉండాలి అనేవారు.డీ.వీ.కే. వ్యక్తిగతంగా సాదాసీదాగా ఉండేవారు.బట్టలపై కూడా ఏమంత దృష్టి ఉండేది కాదు. బీడీ కార్మికోద్యమానికీ, నిజామాబాద్ ఉద్యమానికీ అధ్యుడయినా ఏ మాత్రం గర్వం లేకుండా, సింపుల్గా ఉండేవారు. దేశంలో, రాష్ట్రంలో గాని తన ప్రయాణాలకు బస్సు, రైలు మార్గాలనే అనుసరించేవారు. తనకు ప్రత్యేకంగా ఏదైనా వాహనాన్ని సమకూర్చాలని కోరేవారు కాదు, అలా అడిగినా నిరాకరించేవారు. ప్రధానంగా బస్సుల్లోనే ప్రయాణించేవారు. స్థానికంగా కూడా కారు, ఆటోలను ఉపయోగించుకునే వారు కాదు, తన స్కూటీ వాహనంపైనే ఎక్కడికైనా వెళ్ళేవారు. వయస్సు పెరుగుతున్న దృష్ట్యా, ఇబ్బంది అవుతుందన్న విషయం దృష్టికి తెచ్చినా చివరిదాకా స్కూటీపైనే ప్రయాణించారు. తనకు సంబంధించిన పనులను ఇతరులకు చెప్పేవారు కాదు. సాధ్యమైనంత మేర తనే చేసుకునేవారు. ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకునేవారు,ఇలా ప్రతి విషయంలో 1970 నుండి అన్న పాత్ర ప్రశంసనీయం. శ్రామికుడిగా, అధ్యయన శీలిగా, రచయితగా, నాయకుడిగా, ప్రేమాస్పదుడిగా, ఆదర్శమూర్తిగా కొనసాగారు. ఆదర్శం అంటే ఆదర్శం కోసం కాక జీవితమంటే ఇలానే ఉండాలి అనే దృక్పథం కలిగిన వారు, అలాంటి వ్యక్తి మరణించడం సమాజానికీ, ఉద్యమాలకూ తీరని లోటు, ఆయన ఆదర్శాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెలుదాం.



హన్మేష్, ప్రజాపంథా

### నాలుగేళ్ల డిగ్రీ కోర్సుపై అయోమయం..

# సీట్ల భర్తీపై అనుమానాలు



రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి అన్ని కాలేజీల్లోనూ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రవేపెట్టింది. నూతన విద్యా విధానంలో భాగంగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టారు. విద్యార్థులను బహుముఖ ంగా తీర్చిదిద్దడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారిలో నైపుణ్యాన్ని పెంచండం ఈ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు యొక్క లక్ష్యం. కోర్సు నిర్మాణం కూడా పూర్తిగా మారనుంది. గతంలో డిగ్రీలో మూడు సబ్జెక్టులను తీసుకునేవారు. అంటే లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ తీసుకునేవారు. ఈ మూడు కూడా మేజర్ సబ్జెక్ట్‌లుగానే ఉండేవి. కానీ కొత్త విధానంలో ఒక సబ్జెక్ట్‌ను మాత్రమే మేజర్‌గా తీసుకోవాలి. మైనర్‌గా మరో సబ్జెక్ట్‌ను ఇష్టమొచ్చింది తీసుకోవచ్చు. ఒకరు లెక్కలు మేజర్‌గా తీసుకుంటే మైనర్ కింద ఏ హిస్టరీనో, ఏ మ్యూజిక్‌నో తీసుకోవచ్చు. లేదా కెమిస్ట్రీ , ఫిజిక్స్‌లలో ఏదో ఒకటి తీసుకోవచ్చు. గత డిగ్రీ కోర్సులో ఒక్కొ ఏడాదికి ఆ పేపర్‌లో పాసయ్యారా లేదా అనేది మాత్రమే చూసేవారు. ఇప్పుడు కొత్తగా క్రెడిట్స్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. నాలుగేళ్ల డిగ్రీ కోర్సు సెమిస్టర్ సిస్టమ్‌లో కొనసాగుతుంది. ఒక్కొ సెమిస్టర్‌కు 20 క్రెడిట్స్‌ను కేటాయిస్తారు. మొత్తంగా చూసినప్పుడు ఐదు విభాగాలుగా నాలుగేళ్ల కోర్సు నిర్మాణం ఉంటుంది. మొదటి ఏడాది యూనివర్శిటీ కోర్ కోర్సులు ఉంటాయి. వీటికి 20 క్రెడిట్‌లు ఇచ్చారు. ప్రతి విద్యార్థి ఈ కోర్ కోర్సులు మొదటి సంవత్సరంలో చదవాల్సిందే. రెండో సెమిస్టర్ నుండి విద్యార్థి ఎంచుకున్న మేజర్ సబ్జె క్ట్‌ను చదవాల్సి ఉంటుంది. రెండో సెమిస్టర్ నుండి ఎనిమిదో సెమిస్టర్ వరకు ఈ మేజర్ సబ్జెక్ట్‌ను విద్యార్థి చదవాల్సి ఉంటుంది. ఒక ఒక్క సబ్జెక్ట్‌కే 60 క్రెడిట్స్ కేటాయించారు. ఇందులో కోర్‌తోపాటు ఎలక్టివ్ కూడా కలిపి ఉంటాయి. ఒక మైనర్ సబ్జెక్ట్‌కు 24 క్రెడిట్స్ కేటాయించారు. ఇక మల్టి డిసిప్లీనరీ కోర్సులు ఉంటాయి. ఆ కాలేజీలో ఉన్న వివిధ కోర్సుల్లోంచి ఏదైనా సబ్జెక్ట్‌ను ఎంచుకొని చదవవచ్చు. ఈ కేటగిరీకి 12 క్రెడిట్స్ కేటాయించారు. ఈ కాకుండా చివర్లో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. దీనికి నాలుగు క్రెడిట్స్ కేటాయించారు. ఐదు విభాగాలుగా నాలుగేళ్ల డిగ్రీ కోర్సును యూజిసి పకడ్బందీగా నిర్మాణం చేసింది. కానీ రాష్ట్రంలో దీని అమలుతీరుపైనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**నాలుగేళ్ల డిగ్రీ కోర్సుపై అవగాహన ఏదీ?**

ఓ కొత్త విద్యా విధానాన్ని ప్రవేశపెట్టేప్పుడు దానిపై విద్యార్థులు, అధ్యాపకులతోపాటు ఆ రంగంలో ఉన్న అందరికీ అవగాహన కల్పించాల్సి ఉంది. నూతన విద్యా విధానంలో భాగంగా నాలుగేళ్ల డిగ్రీ కోర్సును పకడ్బందీగా రూపొందించినప్పటికీ కొంత అర్థం చేసుకోవడానికి క్లిష్ట తరంగా కూడా ఉంది. క్రెడిట్స్ విధానం ఏంటి, మేజర్ ఏంటీ, మైనర్ ఏంటీ, ఏదీ మేజర్‌గా తీసుకుంటే ఎటువంటి అవకాశాలు వస్తాయి అనేది అడ్మిషన్లు ప్రారంభమయ్యే నాటికే విద్యార్థులకు అవగాహన కల్పించాలి. కానీ ఈ విద్యా సంవత్సరం నుండి నాలుగేళ్ల డిగ్రీ కోర్సు అమలు చేస్తున్నప్పటికీ పై విషయాలపై విద్యార్థులకు ఎటువంటి అవగాహన లేదు. ఇంటర్ పరీక్షలు అవగానే ప్రాంతాల వారీగా సదస్సులు పెట్టి విద్యార్థుల్లో అవగాహన పెంచుతామని ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. కానీ అది జరగలేదు. తీరా అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత అరకొరగా అవగాహన సదస్సులు జరుగుతున్నాయి. వీటి వల్ల పెద్దగా ఉపయోగం లేదు. గత ఏడాది అగస్టులో అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇవ్వగా ఈ ఏడాది జూన్‌లోనే నోటిఫికేషన్ ఇచ్చారు. జులై మూడు కల్లా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. కానీ విద్యార్థుల్లో పెద్ద గందరగోళం నెలకొంది. నాలుగేళ్ల డిగ్రీ కోర్సు చేసే బదులు ఇంజనీరింగ్‌నే చదువుకోవచ్చు కదా అని చాలా మంది భావిస్తున్నారు. అవగాహనా లోపంతో ఈ ఏడాది డిగ్రీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య తగ్గే అవకాశముందని ప్రయివేట్ డిగ్రీ కాలేజీల యజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సరైన సమయంలో సరైన విధంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించడం జరగలేదని, దీని వల్ల డిగ్రీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య తగ్గే అవకాశముందని ప్రవేయిట్ కాలేజీ యాజమన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు కె .గుండారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రతి యూనివర్శిటీ వాటి పరిధిలో ఉన్న విద్యార్థులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**కనపడని ఎన్ఇపి స్ఫూర్తి**

నూతన విద్యా విధానం ప్రకారం నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో ఏ విద్యార్థి అయినా తన ఇష్టం వచ్చిన మేజర్‌ను ఎంచుకోవచ్చు. మైనర్‌గా ఏదైనా సబ్జెక్ట్‌ను, మల్టి డిసిప్లినరీలో తన అభిరుచికి తగిన అంశాలను ఎంచుకోవచ్చు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ప్రయివేట్ కాలేజీల్లో కొంతమేరుకు అధికంగా మేజర్ సబ్జెక్ట్ లు ఉన్నాయి. అవి కూడా నూతన విద్యా విధానం పేర్కొన్నట్లు విస్తృత స్థాయిలో లేవు. ఇక ప్రభుత్వ డి గ్రీ కాలేజీల్లో అయితే చాలా చోట్ల కీలకమైన ఎకనామిక్స్, మాథమేటిక్స్ మేజర్లు లేనే లేవు. ఇక మైనర్ విషయానికి వస్తే విద్యార్థికి ఇష్టమొచ్చిన మైనర్‌ను ఎంచుకునే అవకాశం లేదు. కాలేజీ యాజమాన్యమే ముందుగానే ఈ మేజర్ తీసుకుంటే ఈ మైనర్ మాత్రమే తీసుకోవాలని నిర్దేశిస్తోంది. మొత్తంగా చూస్తే నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ప్రారంభ సంవత్సరం ముళ్ల మీద నడకలాగే ఉండబోతోంది. నూతన విద్యా విధానం ఏ స్ఫూర్తినయితే అందించాలని కోరుకుందో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో మాత్రం అది నెరవేరడం లేదు.

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం..

హైదరబాద్‌లో శనివారం)రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురుస్తుండగా.. మరి కొన్ని చోట్ల భారీగా పడుతున్నట్టు సమాచారం అందుతోంది. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడుతున్నాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పెద్ద అంబర్‌పేట్ హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్ మన్సూరాబాద్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట వంటి పలు ఏరియాల్లో మోస్తరు జల్లులు పడుతున్నాయి. దీంతో వాహనదారులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇప్పటికే వర్షానికి సంబంధించి జీహెచ్ఎంసీ అధికారులు మెస్సేజ్ ద్వారా అలర్ట్ చేశారు.

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రేపు, ఎల్లుండి మోస్తరు జల్లులుంటాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇక.. నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాయలసీమ, ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి.

## సంగీత సాగరంలో ఓలలాడించిన ముజిగల్ అకాడమీ

ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రతిభను పెంపొందించడానికి అంకితమైన ప్రముఖ సంగీత శిక్షణా సంస్థ అయిన ముజిగల్ అకాడమీ, ఒక విశేషమైన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేపథ్య గాయకులు సాయి శ్రీ చరణ్, సాయి వల్లి శివాని పాల్గొని మంత్రముగ్ధులను చేసే సంగీత కచేరీని చేశారు. వీరితో పాటుగా ఓపెన్ మైక్ సెషన్ లో సరేగమప విజేతలు, గాయకులు వాగ్దేవి, శశాంక్‌ల సమక్షంలో సాయంత్రం సంగీత వైభవానికి అదనపు కోణాన్ని జోడించారు. అన్ని మూజిగల్ అకాడమీలలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు మరపురాని ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ముజిగల్ అకాడమీ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ___ ప్రపంచ సంగీత దినోత్సవం రోజున ఇలాంటి మరపురాని కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సంగీతానికి అందరినీ ఏకం చేసే శక్తి వుందన్నారు. దానికి ఎల్లలు లేవని, ఈ కార్యక్రమం ద్వారా కళాకారులు, వర్ధమాన ప్రతిభావంతులకు ఒక వేదికను అందించడమే తమ లక్ష్యమన్నారు. సాయి శ్రీ చరణ్, సాయి వల్లి శివాని, వాగ్దేవి, శశాంక్, పాల్గొన్న వారందరికీ తాము కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



# ఓటీటీలో 'విమానం' మూవీ వచ్చేస్తుంది..!

కోలీవుడ్ విలక్షణ నటుడు సముద్రఖని ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ ఫ్యామిలీ, ఎమోషనల్ డ్రామా చిత్రం 'విమానం'. ఇటీవలే ఈ చిత్రం థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. అలాంటి ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌గా బుల్లితెర ప్రేక్షకులను అలరించడానికి సిద్ధం అవుతోంది. జూన్ 30వ తేదీ నుండి ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫార్మ్ జీ5 లో ప్రసారానికి అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. అయితే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ చిత్రం OTTలో ఎలాంటి రెస్పాన్స్ ను సొంతం చేసుకుంటుందో చూడాలి.



# ఆర్జీవీ వ్యూహం టీజర్..

## ఏపీ పాలిటిక్స్‌లో సంచలనం రేపేలా ఉందిగా..!

తన మాటలతో వివాదాలు సృష్టించే దర్శకుడు రామ్ గోపాల్ వర్మ లేటెస్ట్‌గా తెరకెక్కిస్తున్న మూవీ 'వ్యూహం'. నాలుగేళ్ల క్రితం 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాతో ఆర్జీవి సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఎన్నికల ఓటమి తర్వాత సీనియర్ ఎన్టీఆర్ జీవితం ఎలా మారింది. ఆయన జీవితంలోకి పార్వతి ఎలా వచ్చింది. వచ్చిన తర్వాత ఏం జరిగింది అనే కాంట్రవర్సీయల్ సబ్జెక్ట్‌తో పెద్ద దుమారమే రేపాడు. ఆ తర్వాత 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు' అంటూ మరో కాంట్రవర్సీయల్ సినిమా తీసి చాలా మందికి టార్గెట్ అయ్యాడు. ఇక ఇప్పుడు అదే తరహాలో 'వ్యూహం'సినిమాతో ఏపీ పాలిటిక్స్‌లో హీట్ పెంచడానికి వస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఇప్పటికే ఆర్‌జీవి విడుదల చేసిన ముఖ్య పాత్రల ఫోటోలు నెట్టింట పెద్ద దుమారమే రేపాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే సినీ, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చ అయ్యేలానే అనిపిస్తుంది. YS రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదం, ఆయన మరణించిన తర్వాత ఏమైంది, ఎవరు ఎలా రియాక్ట్ అయ్యారు. జగన్ ని అరెస్ట్ చేసే సన్నివేశాలు, జగన్ పార్టీ పెట్టే సన్నివేశాలు టీజర్‌లో చూపించారు. చివర్లో జగన్.. నేనలా చేయడానికి చంద్రబాబుని అనుకున్నావా అనే డైలాగ్‌తో టీజర్‌ను హైలెట్ చేశాడు. చూస్తుంటే ఈ టీజర్ పెద్ద సంచలనం సృష్టించే విధంగా అనిపిస్తుంది. వంగవీటి సినిమాను నిర్మించిన దాసరి కిరణ్ ఈ మూవీని నిర్మిస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. అందులో వ్యూహం తొలిపార్టు కాగా, రెండోది శపథం. తొలిపార్టులో YSR మరణం తర్వాత ఏం జరిగిందని, రెండో పార్ట్‌లో జగన్ ఎలా సీఎం అయ్యాడు అనేది ఆర్జీవి చూపించబోతున్నాడు.



# ఎమర్జెన్సీ టీజర్ రిలీజ్..

## ఇందిరా గాంధీ పాత్రలో కంగనా రనౌత్

బాలీవుడ్ స్టార్ నటి కంగనా రనౌత్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఎమర్జెన్సీ'. అప్పటి దేశ ప్రధాన మంత్రి, దివంగత ఇందిరా గాంధీ పాత్రను కంగనా ఈ సినిమాలో పోషిస్తోంది. అలాగే ప్రధాన పాత్ర పోషించటంతో పాటు ఈ సినిమాకు దర్శకత్వం, నిర్మాతగా కూడా వ్యవహరిస్తోంది. దేశంలో 1975 నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను ఈ సినిమాలో చూపించనుంది కంగనా. దీంతో 'ఎమర్జెన్సీ' చిత్రంపై ఆసక్తి మరింత ఎక్కువగా పెరిగింది. తాజాగా కంగనా ఈ మూవీ టీజర్‌ను తన సోషల్ మీడియా అకౌంట్లలో పోస్ట్ చేసింది. దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ పాత్రలో కంగనా ఒదిగిపోయింది. ఆమె మేకోవర్ అచ్చం ఇందిరా గాంధీని పోలినట్టే ఉంది. ప్రొటెక్టరా లేదా డిక్టేటరా? సొంత ప్రజలపై మన దేశ నాయకురాలు యుద్ధం ప్రకటించినప్పటి చీకటి రోజులకు సాక్ష్యమిది. నవంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది" అనే క్యాప్షన్‌తో ఈ సినిమా హిందీ టీజర్‌ను కంగనా పోస్ట్ చేసింది. 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించనట్టుగా దినపత్రిక చూపించడంతో ఎమర్జెన్సీ టీజర్ మొదలైంది. అల్లర్లు జరిగినట్టుగా కూడా కనిపిస్తోంది. ప్రతిపక్ష నేత పాత్ర పోషించిన అనుపమ్ ఖేర్ జైలులో ఉన్నట్టుగా ఉంది. "ఇది మన మరణం కాదు.. దేశానిది" అనే డైలాగ్ అనుపమ్ ఖేర్ చెబుతారు. దివంగత జయప్రకాశ్ నారాయణ్ పాత్రను అనుపమ్ ఖేర్ ఈ చిత్రంలో పోషిస్తున్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజల ఆందోళనలను ఈ టీజర్‌లో చూపించింది కంగనా. టీవీలు ప్రసారాలు బంద్ అయినట్టు, ప్రజలను తుపాకులతో కాల్చినట్టు సీన్లు ఈ టీజర్‌లో ఉన్నాయి. అనంతరం ఇందిరా గాంధీ పాత్ర పోషించిన కంగనా రనౌత్ వాయిస్ ఓవర్ వస్తుంది. "ఈ దేశాన్ని రక్షించడం నుంచి నన్ను ఎవరూ ఆపలేరు. ఎందుకంటే, ఇండియా అంటే ఇందిరా.. ఇందిరా అంటే ఇండియా" అనే వాయిస్ ఓవర్‌తో ఎమర్జెన్సీ టీజర్ ముగిసింది. కంగనా రనౌత్, అనుపమ్ ఖేర్‌తో పాటు సతీశ్ కౌశిక్, మహిమ చౌదరీ, మిలింద్ సోమన్, శ్రేయస్ తల్పాడే.. ఎమర్జెన్సీ మూవీలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# 'భోళా శంకర్' మెగాస్టార్ మాస్ జాతర అదిరింది

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ భారీ బడ్జెట్ మూవీ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్, సాంగ్స్ ప్రేక్షకాభిమానుల్లో ఫుల్ హైప్ పెంచేశాయి. ఇక ఆ అంచనాలను మరింత పెంచేందుకు మేకర్స్ మరో అద్భుతమైన అప్డేట్ తో వచ్చారు. ఈ సినిమా టీజర్‌ను జూన్ 24న మేకర్స్ విడుదల చేశారు. టీజర్ లో తన మార్క్ డైలాగ్‌లు, యాక్టింగ్, గ్రేస్‌తో మెగాస్టార్ చిరంజీవి దుమ్ములేపాడు. మాస్ యాక్షన్‌తో అదరగొట్టాడు. "మొత్తం 33 మందిని చంపేశాడు.. థర్టీ త్రీ పీపుల్.. 'ఒక్కడా.. హా'" అనే బ్యాక్‌గ్రౌండ్ వాయిస్‌తో భోళా శంకర్ మూవీ టీజర్ ప్రారంభమైంది. అప్పుడు మాంచి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ వస్తుండగా.. సింహం బొమ్మ ఉండే డోర్ తెరుచుకొని ఎంట్రీ ఇస్తాడు మెగాస్టార్ చిరంజీవి. "షికారుకొచ్చిన షేర్‌ను బే" అనే డైలాగ్ చెప్తాడు మెగాస్టార్. ఈ మూవీలో ట్యాక్సీ డ్రైవర్, గ్యాంగ్‌స్టర్‌గా చిరంజీవి నటిస్తున్నాడు. చిరూకి చెల్లి పాత్రలో నటిస్తున్న కీర్తి సురేశ్ టీజర్‌లో మరింత అందంగా మెరిసింది. తమన్నా భాటియా హీరోయిన్‌గా నటించింది. "ఎట్లిచ్చినా" అని మెగాస్టార్ అంటే.. మస్తు ఇచ్చినావ్ అన్నా" అని గెటప్ శీను చెప్పిన సీన్ అదిరిపోయింది. 'భోళా ఇది నా ఏరియా' అని ఓ వ్యక్తి అంటే.. "ఈ స్టేట్ డివైడ్ అయినా అందరూ నావాళ్లే. ఆల్ ఏరియాస్ అప్నా హై. నాకు హద్దులు లేవు.. సరిహద్దులు లేవు" అని టీజర్‌లో చిరంజీవి చెప్పిన డైలాగ్ సూపర్‌గా ఉంది. పదకొండు ఆగస్టు దేఖ్‌లేంగే అనే డైలాగ్‌తో భోళా శంకర్ టీజర్ ముగిసింది. ఇందులోని ఫైట్లు స్టైలిష్‌గా ఉన్నాయి. డైరెక్టర్ మెహర్ రమేశ్ మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది. మహతి స్వరసాగర్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా గ్రేస్‌గా ఉంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్‌బ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. సుశాంత్, రఘుబాబు, మురళి శర్మ, రవిశంకర్, వెన్నెల కిశోర్, తులసి, శ్రీముఖి, బిత్తిరి సత్తి, గెటప్ శ్రీను, రష్మి గౌతమ్, ఉత్తేజ్ ఈ మూవీలో నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఆగష్టు 11న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# జూన్ 30న పవర్ స్టార్ తొలిప్రేమ రీ రిలీజ్..

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కెరీర్లో బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన ఎవర్ గ్రీన్ సినిమా 'తొలిప్రేమ'. ఈ చిత్రం 25 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. మొత్తంగా 300 థియేటర్లలో జూన్ 30వ తేదీన తొలిప్రేమ చిత్రాన్ని రీరిలీజ్ చేస్తోంది శ్రీమాతా క్రియేషన్స్. 4కే అల్ట్రా హెచ్‌డీ ఫార్మాట్‌లో ఈ చిత్రం రీరిలీజ్ కానుంది. కాగా, ఈ మూవీ రీరిలీజ్‌కు సంబంధించిన ట్రైలర్ నిన్న (జూన్ 24) విడుదలైంది. ఈ చిత్రంలో కీర్తి రెడ్డి హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాతో ఆమె చాలా పాపులర్ అయింది. నగేశ్, అలీ, వాసుకీ, వేణుమాధవ్, సంగీత ఈ మూవీలో కీలకపాత్రలు పోషించారు. కరుణాకరన్ దర్శకత్వం వహించిన ఈ లవ్ మూవీని ఎస్ఎస్‌సీ ఆర్ట్స్ బ్యానర్‌పై జీవీజీ రాజు నిర్మించారు. దేవ అందించిన సంగీతం తొలిప్రేమ చిత్రానికి ఓ హైలైట్‌గా ఉంది. తొలిప్రేమ చిత్రానికి ఆరు నంది అవార్డులు, 1998లో జాతీయ అవార్డు కూడా వచ్చింది. ఈ చిత్రానికి పవన్ కల్యాణ్ నటన, స్టైల్ ప్రధానమైన హైలైట్‌గా నిలిచింది. కీర్తి రెడ్డి అందం, అభినయం ఈ చిత్రానికి బిగ్ ప్లస్‌గా ఉంది. ప్రేమ, భావోద్వేగాలు, సంగీతం, కామెడీ ఇలా అన్ని విషయాల్లోనూ తొలిప్రేమ చిత్రం ఆకట్టుకుంటుంది. ఈ మూవీ రీరిలీజ్ కోసం పవర్ స్టార్ అభిమానులు ఎదురుచూస్తున్నారు




Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.

# జీవో నెం. 111

# కొంగొత్త నగరం సాధ్యమే

- దీంతో రియల్ ఎస్టేట్ డిమాండ్ తగినట్లుగా భూములు
- ఆ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి
- ఆ భూములతో రియల్ మార్కెట్‌కు మరిన్ని అవకాశాలు
- సిటీలో ఇన్వెంటరీ నియంత్రణపై దృష్టి సారించాలి




జీవో నెం. 111ను రద్దు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దీంతో లక్షన్నర ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు బహిరంగ మార్కెట్‌లోకి రానున్నాయి. ప్రస్తుతం నగర జనాభా కోటిన్నరకు చేరింది. శివారు ప్రాంతాలను దాటి నగరం శరవేగంతో విస్తరిస్తున్నది. ఈ క్రమంలో ఏటా మూడు లక్షల మంది జీవనోపాధి కోసం మహానగరానికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. ల్యాండ్ బ్యాంక్ పుష్కళంగా ఉండే అన్ని రంగాలను ప్రభావితం చేసే రియల్ ఎస్టేట్ కూడా బాగుంటుంది. అదే ల్యాండ్ బ్యాంక్ లేకపోతే పరిశ్రమలకు కొరత ఏర్పడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సన్నగిల్లిపోయే ప్రమాదం ఉంటుంది. వెస్ట్ సిటీని ఆనుకుని లక్షన్నర ఎకరాల భూములు బహిరంగ మార్కెట్లోకి వచ్చిన... ఇప్పటికిప్పుడూ అమ్ముకుని సొమ్ముకోవాలని అనుకున్నా... కనీసం పదేళ్ల వరకు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో అమ్మకాలు, కొనుగోళ్లను ఆ భూములు ప్రభావితం చేస్తాయని అంటున్న నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) తెలంగాణ చాప్టర్ సలహాదారులు, లహరి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ హరిబాబు గడిపాటితో ఈ వారం విశాలభారతి రియల్ టాక్.



జిఓ 111 రద్దు చేయడంతో నగరానికి సమీపంలో సుమారుగా 1.50 లక్షల ఎకరాల భూమి అందుబాటులోకి వస్తోంది. దీంతో వ్యక్తిగత గృహ కొనుగోలు దారులు, స్థిరాస్తులపై పెట్టుబడిదారులకు మంచి అవకాశాలు ఏర్పడుతాయి. అయితే, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్‌ల పరివాహక ప్రాంతంలోని 84 గ్రామాల్లో జరగనున్న అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు అమలు చేయాలనే విషయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిందే. జీవో నెం. 111 ఉపసంహరణతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరుతుంది. ఎకరాకు సగటున రూ. 3 కోట్ల ధరలో, ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూములకు దాదాపు రూ. లక్షల కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఈ ప్రాంతంలో మరో విశ్వనగరాన్ని నిర్మించేందుకు ప్రభుత్వానికి మంచి అవకాశం దొరికింది. మొదట్లో హైదరాబాద్, సికింద్రాబాద్ మాత్రమే ఉండేవి. 2003లో సైబరాబాద్ అనే ప్రాంతం కొత్త నగరంగా అందుబాటులోకి వచ్చింది. అలాగే పుష్కళమైన ల్యాండ్ బ్యాంక్ ఉన్న జంట జలాశయాల పరివాహక ప్రాంతాన్ని గ్రీన్ సిటీగా మార్చడానికి సహజసిద్ధమైన పరిస్థితులు ఉన్నాయి. కానీ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ముందు స్థానికంగా ఉన్న కొన్ని సమస్యలను పరిష్కరించుకుంటే ప్రణాళికబద్ధమైన అంతర్జాతీయ నగరానికి వేదికగా మారిపోతుంది.



## సిటీపై ప్రభావం ఉండదు...

జీవో నెం. 111 ప్రకారం ఆయా గ్రామాల్లో రాబోయే డెవలప్ మెంట్ యాక్టివిటీతో వెస్ట్ సిటీలో గాని, సిటీ వ్యాప్తంగా ఉన్న రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై పడే ప్రభావం చాలా తక్కువేనని అనిపిస్తోంది. కాకపోతే రెసిడెన్షియల్ ప్రాజెక్టుల క్రయవిక్రయాలు తగ్గే అవకాశం ఉందనిపిస్తోంది. ఇదే సమయంలో వెస్ట్ సిటీలో ఊహించని స్థాయిలో పెరిగిన భూముల ధరలు కొంత సర్దుబాటు జరిగేందుకు స్కోపు ఉంది. నగరంలో వచ్చే ఆ భూములతో ధరలపై ఏమాత్రం ప్రభావం చూపకపోవడంతోపాటు, మరింత ఎక్కువగా క్రయవిక్రయాలు జరిగే ఆస్కారం ఏర్పడుతుంది.



## పెరగనున్న డిమాండ్...

హైదరాబాద్‌కు ఏడాదికి దాదాపు 30,000 రెసిడెన్షియల్ యూనిట్లు అవసరమవుతాయి. నేటికి నగరంలో దాదాపు 2.50 లక్షల యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. అందులో 1.10 లక్షల యూనిట్లు పశ్చిమ ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతం ప్రాపర్టీల సరఫరాను కలిగి ఉండవచ్చు, కానీ డిమాండ్ కూడా తదనుగుణంగా పెరిగే అవకాశం ఉంది. అయితే రానున్న రోజుల్లో ఆస్తుల ధరలు ఒకేసారి పెరిగే అవకాశం కనిపించడం లేదు. కానీ భూములకు డిమాండ్ పెరుగుతుంది.

## ఇన్వెంటరీపై దృష్టి సారించాలి....

కరోనా సమయంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ సరికొత్త లక్ష్యాలను చేరుకున్నది. కోవిడ్ కారణంగా సొంతింటి నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చారు. దీంతో చాలా ప్రాంతాల్లో ఇండిపెండెంట్ ఇండ్ల క్రయవిక్రయాలు జరిగాయి. అప్పటి నుంచి దాదాపు రెండేళ్ల పాటు మార్కెట్ అప్ ట్రెండ్‌లో దూసుకుపోయింది. ఇటీవల కాలంలో కొంత స్తబ్ధుగా మారింది. అలా అని మార్కెట్ డౌన్ ట్రెండ్‌లో ఉన్నట్లుగా కాదనే విషయాన్ని గ్రహించాలి. దీనికితోడు కొత్తగా వస్తున్న ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు నిర్విరామంగా సాగుతూనే ఉన్నాయి. నగర మార్కెట్‌కు ఉండే డిమాండ్‌కు మించి సప్లయ్ అందుబాటులోకి రావడంతో క్రయవిక్రయాలపై ప్రతికూల ప్రభావం పడింది.

## బహిరంగ మార్కెట్లోకి వచ్చే భూమి తక్కువే...

ఈ గ్రామాలలో మొత్తం 1.50 లక్షల ఎకరాల వ్యవసాయ భూమిలో 30 శాతం ఇప్పటికే వ్యవసాయేతర భూమిగా మారిపోయింది. మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసి అమలు చేయడానికి కనీసం రెండేళ్లు అయినా పడుతుంది. దాదాపు 50 శాతం భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంది. మిగిలిన 50 శాతం రియల్ ఎస్టేట్ మార్కెట్‌లోకి రాకపోవచ్చు. మొత్తం 1.50 లక్షల ఎకరాల భూమిలో వ్యవసాయేతర భూమి ఓ అంచనా ప్రకారం ప్రకారం 25వేల ఎకరాల లోపే బహిరంగ మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో ఏటా పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా ఐదారేళ్ల కంటే మించకుండానే క్రయవిక్రయాలతో ఆ భూములున్నీ నిండిపోతాయి.



## జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు...

నగరంలో జనాభా పెరుగుతున్నట్లుగా మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మహానగర వ్యాప్తంగా ఫుట్ పాత్‌ల నిర్మాణం జరగాలి. అదేవిధంగా అండర్ గ్రౌండ్ కమర్షియల్ స్పేస్‌ను వినియోగంలోకి తీసుకురాగలిగితే... రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గి, విస్తారమైన రోడ్లు అందుబాటులోకి వస్తాయి. దీంతోపాటు గేటెడ్ కమ్యూనిటీలకు సమీపంలో అండర్ గ్రౌండ్ మార్కెట్ జోన్లను ఏర్పాటు చేయడం వలన వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గిపోతుంది. ఈ తరహా నిర్మాణాలు విదేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. రోడ్లపై వాహనాలు వెళ్తుంటే ఫ్యామిలీతో కలిసి సరదాగా షాపింగ్ చేసుకుంటూ అండర్ గ్రౌండ్ జనసంచారం కనిపిస్తుంది. దీంతో రెండు రకాలుగా ల్యాండ్‌ను సమకూర్చుకునే వెసులుబాటు ఉంటుంది.



## భవిష్యత్ హైదరాబాద్ నగరానిదే...

సిటీలో విస్తారమైన ల్యాండ్ బ్యాంక్, అవసరానికి అనుగుణంగా మౌలిక వసతులు, పాలనపరమైన విధానాలతో హైదరాబాద్ నగరానికి మరిన్ని అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ఇప్పటివరకు మార్కెట్ కొనసాగినట్లుగానే భవిష్యత్‌లోనూ రియల్ ఎస్టేట్ దూసుకుపోతుంది. బెంగుళూరు, ముంబై, ఢిల్లీ వంటి నగరాలకు ధీటుగా అభివృద్ధి చెందుతుండటంతో రియల్ ఎస్టేట్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెరిగే అవకాశాలు వస్తాయి. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో కొంత క్రయవిక్రయాలు మందగిస్తాయి. ఆ మాత్రానికే మార్కెట్ పడిపోయిందనే అపోహలకు గురి కావాల్సిన అవసరమైతే లేదు. అయితే సప్లయ్ పెరగడం, క్రయవిక్రయాలు మందగించిన ఇలాంటి టైంలోనూ వినియోగ దారులు కొంత చొరవ తీసుకుని స్థిరాస్తిని కొనుగోలు చేయడం మంచిది. దీంతో భవిష్యత్తులో ఒక్కసారిగా ధరలు పెరిగితే ఆ ప్రయోజనాలను అందిపుచ్చుకునే వీలు ఉంటుంది.

## ప్రణాళికలతో కొత్త నగరం...

నిజానికి ఆ ప్రాంతంలో కొత్త నగరాన్ని తీర్చిదిద్దడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసే కంటే ముందే మాస్టర్ ప్లాన్ రూపకల్పన, దానికి అనుగుణంగా రోడ్డు, రవాణా సదుపాయాలను మెరుగుపరిచే ప్రణాళికలను అమలు చేసి ఉంటే... ఆ నగరంలో పెరుగుతున్న డిమాండ్ అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఏర్పడేది. కానీ ప్రభుత్వం ఉన్న ఫళంగా ఆ జీవోను తొలగించడంతో ఇబ్బడిముబ్బడి భూముల క్రయవిక్రయాలు, నిర్మాణ రంగం పుంజుకుంటే మౌలిక వసతుల అభివృద్ధికి ఇబ్బందిగా మారేందుకు అవకాశం ఉంది. ఈ సమయంలోనే ప్రభుత్వమే ముందుగా చొరవ తీసుకుని ఆ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయిలో మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేసి డెవలప్ చేయడం వలన భావి తరాలకు ప్లాన్డ్ సిటీ అందించినవాళ్లు అవుతారు. లేదంటే అదొక భారంగా మారే ప్రమాదం ఉంటుంది.

